V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
29-09-2024

సంపుటి : 01 । సంచిక : 147 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్





## జవాన్ల త్యాగం కాంగ్రెస్‌కు తెలియదు

### నాలుగు దశాబ్దాలుగా సైనికులకు మాయమాటలు చెప్పింది

'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' ఇస్తామంటూ వారిని ఎదురుచూసేలా చేసింది"

కుటుంబ పార్టీలతో ప్రజలు విసిగిపోయారు

జమ్మూ కశ్మీర్ ఎన్నిక ప్రచారంలో ప్రధాని వ్యాఖ్యలు

61 శాతం పోలింగ్ నమోదవడంపై హర్షం

బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసిన మోదీ

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలోనే జమ్మూలో బీజేపీ ఏర్పాటుచేసిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.కాంగ్రెస్, ఎన్సీపీ, పీడీపీ ఈ మూడు కుటుంబ పార్టీలతో జమ్మూకశ్మీర్ ప్రజలు విసిగిపోయారని ప్రధాని విమర్శించారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్షను ఈ ప్రాంత ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, రక్తపాతానికి దూరంగా ఉండాలని వారు ఆకాంక్షిస్తున్నారని

మిగతా2లో...

“ కాంగ్రెస్, ఎన్సీపీ, పీడీపీ ఈ మూడు కుటుంబ పార్టీలతో జమ్మూకశ్మీర్ ప్రజలు విసిగిపోయారు.ఈ ప్రాంత ప్రజలు ఉగ్రవాదం, వేర్పాటువాదం, రక్తపాతానికి దూరంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రవాదులపై ఎదురుకాల్పులకు దిగింది. సర్జికల్ స్ట్రైక్ జరిగిన నాడు నవ భారత్‌ను ప్రపంచమంతా చూసింది.అంటూ జమ్మూకాశ్మీర్ ఎన్నిక ప్రచారంలో ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు.





## నల్సార్‌లో 57మందికి గోల్డ్ మెడల్స్

కోర్సులను విజయవంతంగా పూర్తిచేసిన 592మంది పట్టభద్రులు

పట్టాలు ప్రదానం చేసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**విశ్వంభర, హైదరాబాద్:** నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం (నేషనల్ అకాడమీ ఫర్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ 21వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్. నర్సింహ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. యూనివర్సిటీ చాన్సలర్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు మిగతా2లో...

## స్వర్ణాంధ్రప్రదేశ్ @2047 ప్రయాణం ప్రారంభం

### మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యం

- స్వర్ణాంధ్ర సాధనకు సూచనలు పంపండి
- ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటాం
- సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మించుకుందాం
- ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలను మిగతా2లో...

## ప్రముఖ రచయిత్రి విజయభారతి కన్నుమూత

- ఆమె మృతి పట్ల సీఎం రేవంత్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం
- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన రెండో మహిళగా గుర్తింపు
- తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించారు
- జోతిరావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి అందించిన రచయిత్రి



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రముఖ రచయిత్రి బి విజయభారతి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ శనివారం మిగతా2లో...




## హైడ్రా బూచి కాదు... బాధ్యత, భరోసా

పేదలను ఇబ్బంది పెట్టాలనేది అభిమతం కాదు

విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే సీఎం హైడ్రాను తీసుకొచ్చారు: కమిషనర్ రంగనాథ్

8



3

ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ అధ్యక్షుడిగా శ్రేయమ్స్ కుమార్

## మహిళే యజమానిగా కుటుంబ డిజిటల్ కార్డులు

### డేటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలి

- వివరాల నివేదికను సమగ్రంగా రూపొందించాలి
- మంత్రివర్గ ఉప సంఘానికి అందజేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు
- సచివాలయంలో సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:**



కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించాలని, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలు కార్డు వెనుక ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సంబంధించి రాష్ట్ర సచివాలయంలో సీఎం శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై ఈ నెల 25 నుంచి 27 వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రల్లో పర్యటించిన అధికారులు చేసిన అధ్యయనంపై మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 125 | రిటైల్ ₹ 147 |
| స్కిన్ ₹ 213 | స్కిన్ లెస్ ₹ 243 |



2

## ఇజ్రాయెల్ దాడుల్లో హసన్ నస్రల్లా హతం

32 ఏళ్లకే హెజ్‌బొల్లా చీఫ్‌గా బాధ్యతల స్వీకరణ

దేశంలో తిరుగులేని నేతగా చెలామణి

దేశ విధానాల రూపకల్పనలో కీలకపాత్ర

## థీమ్ ఏంటి? గేమ్ ప్లాన్ ఏంటి?

మూసీ సుందరీకరణకే రూ.1.50లక్షల కోట్లా?

కాంగ్రెస్ ధన దాహానికి సజీవసాక్ష్యం

కాళేశ్వరానికి రూ.80వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ గగ్గోలు పెట్టింది

ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శలు



2

# మహిళే యజమానిగా కుటుంబ డిజిటల్ కార్డులు



(మొదటి పేజీ తరువాయి)
పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్డుల రూపకల్పలో ఆయా రాష్ట్రాలు సేకరించిన వివరాలు, కార్డులతో కలిగే ప్రయోజనాలు, లోపాలను అధికారులు వివరించారు. అనంతరం సీఎం రేవంత్ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాల నిర్ధారణ చేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల కార్డుల రూపకల్పన, జారీలో ఉన్న మేలైన అంశాలను స్వీకరించాలని, లోపాలను పరిహరించాలన్నారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వంటి అనవసర సమాచారం సేకరించాల్సిన పని లేదన్నారు.

**ప్రతి నియోజకవర్గంలో రెండు ప్రాంతాల్లో..**
ఫ్యామిలీ డిజిటల్ కార్డులకు సమచార సేకరణ, వాటిల్లో ఏయే వివరాలు పొందుపర్చాలి, అప్‌డేట్‌కు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘానికి అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలను సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. అనంతరం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో రెండు ప్రాంతాలు ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం సూచించారు. కుటుంబాల నిర్ధరణ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డాటా ఆధారంగా అక్టోబర్ 3 నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేయించాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టును పకడ్బందీగా చేపట్టాలని, ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి అధికారిని, పట్టణాలు, నగర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని పర్యవేక్షణ కోసం నియమించాలన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాకు ఇటీవల వరదల సమయంలో వేసిన సీనియర్ అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలన సమగ్రంగా కచ్చితత్వంతో చేపట్టాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని హెచ్చరించారు.

## ఇజ్రాయెల్ దాడుల్లో హసన్ నస్రల్లా హతం..

**హెజ్‌బొల్లా:** పేజర్, వాకీటాకీలను పేల్చి హెజ్‌బొల్లాను కంగుతినిపించిన ఇజ్రాయెల్.. ఆ వెంటనే ఆ గ్రూప్‌ను కోలుకోనీయకుండా నాయకత్వ హోదాలో ఉన్నవారిని మట్టుపెట్టడం మొదలు పెట్టింది. చివరకు హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాను హతం చేసిటన్లు తాజాగా ప్రకటించింది. ఇలా లీడర్లను తుదముట్టిస్తూ.. శ్రేణుల పోరాటపటిమను దెబ్బతీస్తోంది. "నస్రల్లా చనిపోతే హెజ్ బొల్లా పూర్తిగా నిర్వీర్యం కాదు. కానీ సభ్యుల సామర్థ్యానికి ఇది భారీ ఎదురుదెబ్బ" అని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మరోపక్క లెబనాన్ ప్రభుత్వంలో నస్రల్లా ఎలాంటి పదవులు చేపట్టనప్పటికీ.. ఆ దేశ విధానాల రూపకల్పనలో అతడికి కీలకపాత్ర. తిరుగులేని నేతగా చెలామణీ అయిన అతడికి వారసుడు ఎవరు..? అనే చర్చ మొదలైంది. ఇజ్రాయెల్పై పోరాడే విషయంలో ఇరాన్, హెజ్ బొల్లా కలిసే ముందుకువెళ్తున్నాయి. దాంతో తదుపరి అధిపతి ఈ రెండువర్గాల ఆమోదం ఉన్నవ్యక్తే ఉంటారని తెలుస్తోంది. ఆ గ్రూప్ రాజకీయ వ్యవహారాలను పర్యవేక్షించే హాషీమ్ సఫీద్దీన్ నస్రల్లాను వారసుడిగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయని అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. అతడు హెజ్ బొల్లాకు చెందిన జిహాద్ కౌన్సిల్ సభ్యుడు. అన్నింటికి మించి నస్రల్లా బంధువు. నాయకత్వ బాధ్యతలను అప్పగించేందుకు వీలుగా నస్రల్లా అతడిని తీర్చిదిద్దినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అలాగే ఇద్దరిలోనూ పోలికలు ఉంటాయట. అతడిని 2017లో అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇదిలా ఉంటే.. 1992లో అప్పటి హెజ్ బొల్లా అధినేత అబ్బాస్ అల్ ముసావిని ఇజ్రాయెల్ దళాలు హతమార్చడంతో గ్రూప్ పగ్గాలు చేపట్టినప్పుడు నస్రల్లా వయసు 32 ఏళ్లే. అతడి నాయకత్వంలో హెజ్ బొల్లా ఇంతలా బలపడి ఉంటుందని బహుశా అప్పుడు ఇజ్రాయెల్ మిలిటరీ దళాలు ఊహించకపోవచ్చు. 2006లో లెబనాన్లో 34 రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ వెనుదిరగడంలో అతడు కీలక ప్రాత పోషించాడు. అప్పటి నుంచే ఇజ్రాయెల్కు బద్ధ శత్రువుగా మారాడు. గాజాలో కాల్పుల విరమణ జరిగే దాక.. ఇజ్రాయెల్పై తమ దాడులు ఆగవని ఇటీవల నస్రల్లా ప్రకటన చేశాడు. నస్రల్లాను అంతమొందించేందుకు ఇజ్రాయెల్ అనేకసార్లు ప్రయత్నించి.. తాజాగా విజయం సాధించింది. అతడి మరణాన్ని తాజాగా హెజ్బల్లా కూడా ధ్రువీకరించింది.

## నల్సార్‌లో 57మందికి గోల్డ్ మెడల్స్

(మొదటి పేజీ తరువాయి)
పట్టాలను ప్రదానం చేశారు. నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీకృష్ణ దేవ రావు , వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి , మంత్రి సీతక్క , ఇతర ముఖ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.పీహెచ్‌డీ, ఎల్‌ఎల్‌ఎం, ఎంబీఏ, బీఏ ఎల్‌ఎల్‌బీ, బీబీఏ తదితర కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న 592 మంది విద్యార్థులకు పట్టాలు అందుకున్నారు. పట్టభద్రులైన వారిలో 57 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు.

## స్వర్ణాంధ్రప్రదేశ్ @2047 ప్రయాణం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)
swarnandhra.ap.gov.in/Suggestions ద్వారా పంపవచ్చన్నారు. ఇలా చేసిన అనంతరం అభినందనలను ఇ-సర్టిఫికెట్ ద్వారా అందుకోవచ్చని చెప్పారు. 2047 నాటికి మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ @2047 వైపు ప్రయాణాన్ని ప్రారంభించామని చెప్పారు. ఏపీ భవిష్యత్తు రూపకల్పనకు పౌరులు సూచనలు ఆహ్వానిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటూ సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మించుకుందామన్నారు.

## థీమ్ ఏంటి? గేమ్ ప్లాన్ ఏంటి?

**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ సుందరీకరణ వ్యయంపై 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. "మూసీ సుందరీకరణ కోసం మొన్న రూ.50వేల కోట్లు అన్నారు. నేడు రూ.1.50లక్షల కోట్లు అంటున్నారు. మూసీ సుందరీకరణకే రూ.1.50లక్షల కోట్లా? కాళేశ్వరానికి రూ.80వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ గగ్గోలు పెట్టింది. మూసీ ప్రాజెక్టుతో మురిసే రైతులెందరు.. నిల్వ చేసే టీఎంసీలు ఎన్ని? పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కన్నా మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ? లండన్లో థేమ్స్ లాగా మారుస్తామనే వ్యూహం వెనుక థీమ్ ఏంటి? గేమ్ ప్లాన్ ఏంటి? మూడింతలు పెంచిన అంచనా వ్యయం కాంగ్రెస్ ధన దాహానికి సజీవసాక్ష్యం" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## జవాన్ల త్యాగం కాంగ్రెస్‌కు తెలియదు

(మొదటి పేజీ తరువాయి)
ప్రధాని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన జవాన్ల విలువ కాంగ్రెస్‌కు తెలియదంటూ ఆ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "కాంగ్రెస్ హయాంలో సరిహద్దుల్లో కాల్పులు జరిగినప్పుడల్లా ఆ పార్టీ తెల్ల జెండాలను ఎగురవేసింది. కానీ, బీజేపీ భారత్‌ను ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. భారత్ ఉగ్రవాదులపై ఎదురుకాల్పులకు దిగింది. 2016 సెప్టెంబరు 28 రాత్రి సర్జికల్ స్ట్రైక్ జరిగింది. శత్రువుల భూభాగంలోకి వెళ్లి దాడి చేయగలిగిన నవ భారత్‌ను నాడు ప్రపంచమంతా చూసింది. దేశ రక్షణ కోసం జవాన్లు చేసిన త్యాగం విలువ ఆ పార్టీకి తెలియదు. వారిని ఎన్నడూ గౌరవించలేదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ సైనికులకు మాయమాటలు చెప్పింది. 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' ఇస్తామంటూ వారిని ఎదురుచూసేలా చేసింది" అని తీవ్ర ఆరోపణలు చేశారు.

**బీజేపీ విజయం సాధిస్తుందని మోదీ ధీమా..**
జమ్మూకశ్మీర్ లోని ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు ఇటీవల జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగ్ నమోదవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. "ఈ విజయదశమి మనందరికీ ఎంతో ప్రత్యేకం. జమ్మూకశ్మీర్లో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది. పూర్తి మెజారిటీ అధికారంలోకి వస్తుంది" అని విశ్వాసం వ్యక్తంచేశారు.

## ప్రముఖ రచయిత్రి విజయభారతి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)
ఉదయం తుదిశ్వాస విడిచారు. శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆమెను సనత్‌నగర్‌లోని రెనోవా ఆస్పత్రికి తరలించారు కుటుంబ సభ్యులు. విజయభారతి మృతితో ఆమె కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతిపట్ల పలువురు రచయితలు, మేధావులు, నాయకులు సంతాపం ప్రకటించారు. దళిత సాహిత్యానికి తీరని లోటు అని పేర్కొన్నారు.1968లో ప్రముఖ హేతువాది, దళిత నాయకుడు, న్యాయవాది బొజ్జా తారకంను విజయభారతి వివాహం చేసుకున్నారు. బొజ్జా తారకం, విజయభారతి దంపతుల కుమారుడు రాహుల్ బొజ్జా.. ఈయన ప్రస్తుతం తెలంగాణ కేడర్‌లోరాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజోలులో 1941లో ప్రముఖ రచయిత బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతులకు విజయభారతి జన్మించారు. కోఠి ఉమెన్స్ కాలేజీ నుంచి పీజీ పూర్తి చేశారు. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం – సాంఘిక పరిస్థితులు అను అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో



డాక్టరేట్ పొందిన రెండో మహిళ విజయభారతి కావడం విశేషం. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా విజయభారతి తనదైన ముద్ర వేశారు.బొజ్జా మాతృమూర్తి.

**సాహితీ రంగానికి విజయభారతి చేసిన సేవలు అపారమైనవిః సీఎం రేవంత్ రెడ్డి**
ప్రముఖ రచయిత్రి, దివంగత పౌర హక్కుల నేత బొజ్జా తారకం సతీమణి బి. విజయభారతి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు తీవ్ర సంతాపం తెలిపారు. ప్రముఖ రచయిత దివంగత బోయి భీమన్న గారి కుమార్తె, ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జా గారి మాతృమూర్తి అయిన విజయభారతి తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలు అందించడంతో పాటు ప్రాచీన సాహిత్య కోశం, ఆధునిక సాహిత్య కోశం వెలువరించారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సాహితీ రంగానికి విజయభారతి చేసిన సేవలు అపారమైనవని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**డాక్టర్ విజయభారతికి కేసీఆర్ నివాళి...**
సుప్రసిద్ధ కవయిత్రి, రచయిత్రి, అనువాదకురాలు, అంబేద్కరిస్ట్ డా.విజయభారతి మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా విశ్లేషకులుగా విజయభారతి చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు.తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్‌గా సేవలందించిన విజయ భారతి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంపుటాలకు సంపాదకురాలుగా, మహాత్మా జోతిరావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి మొట్టమొదటి సారి అందించిన రచయిత్రిగా వారి కృషి అమోఘమన్నారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బీజేపీ నేతలకు జమ్మూకశ్మీర్ పావు..

**బిష్ణ:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జమ్మూకశ్మీర్కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని ఆ పార్టీ నేత ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రాజేయడానికి జమ్మూకశ్మీర్ను ఓ పావుగా భాజపా వాడుకుంటోందని ఆరోపించారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో భాగంగా ఇక్కడి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో శనివారం ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ, అమిత్ షాపై విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్ పట్ల కాంగ్రెస్‌కు స్పష్టమైన విధానం ఉందని ప్రియాంక గాంధీ అన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని చెప్పారు. దర్బార్ సంప్రదాయాన్ని (సీజన్ వారీగా జమ్మూ, శ్రీనగర్ మధ్య ప్రభుత్వ కార్యాలయాల మార్పిడి) పునరుద్ధరిస్తామని చెప్పారు. జమ్మూకశ్మీర్ పౌరుల హక్కులను కాపాడుతామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తన నాన్నమ్మ ఇందిర గాంధీకి జమ్మూకశ్మీర్తో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆమె హత్య కావడానికి నాలుగైదు రోజుల ముందు కశ్మీర్ అందాలను చూడాలనుకుంటున్నట్లు తమతో పేర్కొన్నారని ప్రియాంక ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**జమ్మూకశ్మీర్ వారికి పావు..**
"మీకు రాష్ట్ర హోదా కావాలంటే తమకు ఓటేయండని అమిత్ అడుగుతున్నారు. వాస్తవానికి రాష్ట్ర హోదా తీసుకున్నదే వారు. ఇదెలా ఉందంటే.. టీవీ ఎత్తుకెళ్లిన వారే 'టీవీ కావాలంటే నన్ను అడగండి' అన్నట్లు ఉంది" అని ప్రియాంక గాంధీ ఎద్దేవాచేశారు. జమ్మూకశ్మీర్‌పై ప్రధాని మోదీకి ఏమాత్రం ప్రేమ లేదని, వారి సమస్యలు ఆయనకు పట్టవని విమర్శించారు. తమ రాజకీయ చదరంగంలో జమ్మూకశ్మీర్ అనేది ఒక పావు మాత్రమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి జమ్మూకశ్మీర్ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు.

## పేదలకు సహాయం చేయ్.. కన్నీళ్లు పెట్టించకు

- కూల్చివేతలను ఒప్పించి చేయాలి తప్పా..
- బెదిరింపులు సరికాదు
- మూసీ నది సుందరీకరణ పేరుతో
- వేల మందిని నిరాశ్రయులను చేస్తున్నావ్
- కాంగ్రెస్, టీడీపీ హయాంలోనే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు..
- మూసీ ప్రక్షాళనపై సీఎం రేవంత్‌పై మండిపడ్డ హరీశ్‌రావు

**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ నది సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి వేల మందిని నిరాశ్రయులను చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మూసీ



నది పరివాహక ప్రాంతంలో నిర్మించుకున్న ప్లాట్లన్నీ కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రిజిస్ట్రేషన్ చేయబడ్డాయని హరీశ్‌రావు గుర్తు చేశారు. గాంధీ ఆస్పత్రి వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో వారి ప్లాట్లు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఈ ఇండ్లలో నివసిస్తున్న వారు కరెంట్ నల్లా బిల్లులు కడుతున్నారు. నది పరివాహక ప్రాంతంలో 40 ఏండ్ల నుంచి జీవిస్తుంటే నేలమట్టం చేసే అధికారం నీకు ఎవరిచ్చారు..? మూసీ సుందరీకరణ పేరుతో వేల మందిని నిరాశ్రయులను చేస్తున్నవ్ అని హరీశ్‌రావు మండిపడ్డారు. నీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. నిర్వాసితుల ఇండ్లు తీసుకోవాలంటే నష్ట పరిహారం చెల్లించి, కొత్తగా డబుల్ బెడ్రూం ఇవ్వాలని ఉంది. జీవనోపాధి కింద రూ. 5 లక్షలు ఇవ్వాలని నీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన 2013 చట్టం చెబుతుందని హరీశ్‌రావు గుర్తు చేశారు. పేదలను ఒప్పించి చేయాలి తప్పా.. ఈ బెదిరింపులు సరికాదు. శని, ఆదివారాల్లో కూలగొట్టే ప్రయత్నాలు చేయడం మూర్ఖత్వం. సీఎంగా పేదలకు సహాయం చేయ్.. కన్నీళ్లు పెట్టించకు. లక్షలాది మంది నిద్ర పోని పరిస్థితి తెచ్చావ్.. భయభ్రాంతులకు గురి చేస్తున్నవ్.. ప్రజలకు ఇచ్చిన హామీలు చేయ్.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రజల హక్కులను కాపాడాలి. బలవంతంగా ఖాళీ చేస్తామంటే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదు. ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దు.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. జీవించి పోరాడాలి. పోరాడి సాధించుకోవాలి.. ప్రాణాలు తీసుకోవద్దు అని హరీశ్‌రావు బాధిత కుటుంబాలను విజ్ఞప్తి చేశారు.

## యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తాపడం.. పనుల నిర్వహణకు ఉత్తర్వులు జారీ



**విశ్వంభర, యాదాద్రి :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సారథ్యంలో జరిగిన సమావేశాల్లో పలు నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి చొరవతో దేవాలయ విమాన గోపురానికి బంగారు తాపడం పనులు ప్రారంభించేందుకు సీఎం రేవంత్రెడ్డి అనుమతి ఇచ్చారు. వెంటనే ఆ పనులను ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బంగారు తాపడం పనుల బాధ్యతలను స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులు స్వామి బ్రహ్మోత్సవాల నాటికి ముందే 2025 మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు.ఈ పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ చైర్పర్సన్, దేవాదాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్గా ప్రభుత్వ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సలహాదారు, వైటీడీఏ ఉపాధ్యక్షుడు జి.కిషన్రావు, యాదగిరిగుట్ట దేవస్థాన కార్యనిర్వహణాధికారి, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బంగారు తాపడం పనులను పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలివ్వనున్నారు. ఈ మేరకు బంగారు తాపడం పనులు, ఈ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సంబంధించి రెండు వేర్వేరు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ అభివృద్ధి, విస్తరణ పనుల నిమిత్తం భూసేకరణకు అనుమతులను మంజూరు చేస్తూ మరో జీవో జారీ చేసింది.

## గాంధీ ఆస్పత్రిలో హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

విశ్వంభర, హైదరాబాద్ : సికింద్రాబాద్ పరిధిలోని గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. హైడ్రా వేదింపులతో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహాన్ని చూసేందుకు గాంధీ ఆస్పత్రికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పై నుండి ఆదేశాలు ఉన్నాయంటూ మార్చురీ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.హైదరాబాద్‌లో దూకుడుతో ఉన్న హైడ్రా ఓ మహిళ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న సంగతి తెలిసిందే. తన కూతుళ్లకు వరకట్నంగా ఇచ్చిన ఇల్లు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నదన్న అధికారుల హెచ్చరికలు ఆమెను భయాందోళనకు గురిచేశాయి. తమ కూతుళ్ల కుటుంబాలకు ఆధారం పోతుందన్న బెంగతో ఉరేసుకొని ప్రాణమే తీసుకున్నది. హైడ్రా చర్యలతో కట్టుబట్టలతో బజారున పడుతూ దుఃఖసాగరంలో ఎన్నో బాధిత కుటుంబాలు మునిగిపోతుండగా, ఏకంగా ఓ మహిళ ప్రాణం తీసుకోవడం సంచలనంగా మారింది. హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనతో విషాదం నిండుకున్నది. కూకట్‌పల్లి రామాలయానికి చెందిన గుర్రంపల్లి శివయ్య, బుచ్చమ్మ దంపతులు కూలిపనులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురికీ వివాహాలు చేసి కట్నం కింద నల్ల చెరువు వద్ద ఉన్న ఇం టిని ఇచ్చారు. కూల్చివేతల్లో భాగంగా నల్ల చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు ఇండ్లు ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కూతుళ్లకు ఇచ్చిన ఇల్లు కుల్చివేస్తే బిడ్డలు రోడ్డున పడుతారనే మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బుచ్చమ్మ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబసభ్యు లు దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు.



# అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారు

- తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు
- రాష్ట్రం ఏర్పడ్డా వారి జీవితాలు మారలేదు
- స్వీపర్లందరిని రెగ్యులరైజ్ చేయాలి
- చనిపోయినవారి స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టాలి
- స్కూల్స్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి



**విశ్వంభర,హైదరాబాద్** : స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దళసరి అనసూయ (సీతక్క)కి ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ కాచం సత్యనారాయణ, టి ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఖలీల్, స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.గట్టన్న హైదరాబాద్ లోని ప్రజా భవన్‌లో కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు.
గత 40, 50 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లు అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని వారు వినతి పత్రంలో తెలిపారు . ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జీవోలు 212, 112 ప్రకారము గత 30 సంవత్సరాల క్రితమే స్వీపర్లందరినీ రెగ్యులరైజ్ చేశారు. తెలంగాణ ప్రాంతంలో మాత్రం వారిని రెగ్యులరైజ్ చేయకుండా తీవ్రమైన అన్యాయానికి గురి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తమకు న్యాయం జరగదని భావించిన స్వీపర్లు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న దశలో సమైక్యాంధ్ర సంఘాన్ని వదిలేసి తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైనారన్నారు. అప్పట్లో తెలంగాణ కై పోరాడుతున్న నాయకులందరూ కూడా రాష్ట్రం ఏర్పడితే స్కూల్ స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ప్రథమ కర్తవ్యంగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రమేర్పడ్డాక హామీ ఇచ్చిన వాళ్లలో అనేకమంది మంత్రులయ్యారు. కానీ స్వీపర్ల జీవితాలు మారలేదన్నారు.

2014లో రాష్ట్రం ఏర్పడ్డ సమయంలో తెలంగాణ ప్రాంతంలో సుమారు 5600 మంది స్కూల్ స్వీపర్లు పని చేస్తున్నారు. వీరిలో అనేకమంది 61 సంవత్సరాలు నిండినవని ఎలాంటి నోటీసు లేకుండా, రిటైర్మెంట్ బెనిఫిట్ లేకుండా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిర్దాక్షణంగా తొలగించబడ్డారని పేర్కొన్నారు. ఇంకొందరు విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో అర్ధాకలితో మరణించారు . ప్రస్తుతం 2033 మంది మాత్రమే పని చేస్తున్నట్టు ప్రభుత్వ వేతనాల ప్రపోజల్స్ ద్వారా తెలుస్తుంది. వీరిలో ఏడుగురిని మాత్రమే పూర్తి కాలం స్లీపర్లుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. మిగితా వారందరూ పార్ట్ టైం స్వీపర్లుగా పరిగణించబడుతున్నారు. వీరిలో 560 మందికి 2016 నుండి కనీస వేతనం అమలు చేయకుండా కేవలము 1623 రూపాయలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు. మిగిలిన వారికి రూ.5200 చెల్లిస్తున్నారు. ఇంత తక్కువ వేతనము దేశంలో ఏ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కూడా లేదని కనీస వేతనాల జీవోలను పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. వీరు కాకుండా సుమారు 160 మంది చనిపోయిన స్థానంలో వారి కుటుంబ సభ్యులు వేతనము లేకుండా పనిచేస్తున్నారు. ఇతర శాఖలలో మాదిరిగానే కారుణ్య నియామకాలు చేపడతారని ఆశతో వీరు వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు.
ఇటువంటి అమానవీయ విధానాలను తక్షణము రద్దుచేసి స్వీపర్లందరిని రెగ్యులరైజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ లోపు అందరికీ 26 వేల రూపాయలు అందరికీ సమానంగా ఇవ్వాలని కోరారు. 61 సంవత్సరాలు నిండిన వారికి 10 లక్షల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. చనిపోయిన స్వీపర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఒకరిని నియామకం చేయాలని వారు కోరారు. పై సమస్యల పరిష్కారం కై మానవతా దృక్పథం తో పరిశీలించి దసరా కానుకగా స్వీపర్లకు తీపి కబురు అందించాలని మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందిస్తూ విద్యాశాఖ తో సమన్వయం చేసుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి యాసారపు అంజయ్య, రాష్ట్ర నాయకులు గాదె చంద్రయ్య, సత్యనారాయణ, టి ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు శ్రావణ్, కృష్ణారెడ్డి, జి గోవిందు పాల్గొన్నారు.



## సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

### V3 న్యూస్ కథనానికి స్పందన



**విశ్వంభర, సూర్యాపేట** : గత కొద్ది రోజులుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిరంజిలు , మెడిసిన్ అందుబాటులో లేక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను V3న్యూస్ ప్రసారం చేసింది. V3కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు.ఆస్పత్రి యొక్క ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు.

## 4.7 కేజీల బంగారం స్వాధీనం

### కోయంబత్తూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలింపు

### ముఠాను పట్టుకున్న డీఆర్ఏ అధికారులు



**విశ్వంభర, హైదరాబాద్:** కోయంబత్తూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా బంగారం తరలిస్తున్న ముఠాను డీఆర్ఏ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4.7 కేజీల విదేశీ బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రోడ్డు మార్గం ద్వారా విదేశీ బంగారాన్ని తీసుకొస్తున్నారన్న సమాచారంతో నగర శివారులోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద కారును అడ్డుకొని అధికారులు సోదాలు చేశారు. కారు హ్యాండ్ బ్రేక్ దిగువన ప్రత్యేకంగా తయారు చేసిన క్యావిటీలో బంగారం దాచినట్టు గుర్తించారు. బంగారం తరలిస్తున్న ముగ్గురిపైనా కస్టమ్స్ చట్టం 1962 నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని డీఆర్ ఐ అధికారులు వెల్లడించారు.

## మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లుపై జస్టిస్ పీసీ ఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీకెంట్ ఫైల్స్పై వెంకటేశ్వర్లు చెప్పిన సమాధానంపై మండిపడ్డారు. తన వద్ద ప్లాన్స్, డిజైన్స్ ఉన్నాయని... కమిషన్కు తప్పుడు సమాచారం ఇస్తారా? అని జస్టిస్ ఘోష్ ప్రశ్నించారు. గతంలో కాళేశ్వరం ఈఎన్సీగా పని చేసిన వెంకటేశ్వర్లు శనివారం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. వివిధ అంశాలకు సంబంధించి ఆయను కమిషన్ ప్రశ్నించింది. ప్రత్యేకంగా మేడిగడ్డ ఆనకట్టకు సీకెంట్ ఫైల్స్ వినియోగించమని ఎవరు సూచించారని కమిషన్ ఛైర్మన్ ప్రశ్నించగా.. సీడీవో సీఈ సూచనల మేరకు ఇలా చేశానని సమాధానమిచ్చారు.
దీనిపై కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయవద్దని ఘాటుగా జస్టిస్ ఘోష్ వ్యాఖ్యానించారు. అయితే, తన సమాధానాన్ని సరిచూసుకునే అవకాశం ఇవ్వాలని వెంకటేశ్వర్లు కోరగా.. దీనికి అంగీకరించబోనని తేల్చి చెప్పారు. తగిన దస్త్రాలు సమర్పిస్తే సవరించుకునే అవకాశం ఇస్తామని అన్నారు. తనకు ఆంగ్లంపై పూర్తిగా పట్టు లేదని వెంకటేశ్వర్లు తెలపగా.. ఆంగ్లంపై పట్టు లేకుండానే కాళేశ్వరం సీఈగా ఎలా పని చేశారని కమిషన్ అసహనం వ్యక్తం చేసింది.

## స్థానిక సమస్యలపై పోరాటం చేయండి

### 15 రోజుల్లో నిర్దేశించుకున్న సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### బీజేపీ సభ్యత్వ నమోదులో జేపీ నడ్డా కార్యకర్తలకు దిశానిర్దేశం



**విశ్వంభర, హైదరాబాద్:** 15 రోజుల్లో నిర్దేశించుకున్న సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి నడ్డా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదుపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు తిరుగుతున్న ఆయన.. ఇవాళ పాట్నా నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట చేరుకున్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు రాష్ట్ర పదాధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న పార్టీ సభ్యత్వ నమోదుపై ఆరా తీశారు.
తెలంగాణలో 50 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకోగా.. లక్ష్యానికి మించి చేయాలని దిశానిర్దేశం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 77 లక్షల ఓట్లు, 8 ఎంపీ సీట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 77లక్షల ఓట్లు వచ్చినప్పుడు 50 లక్షల సభ్యత్వం అంత కష్టమేమీ కాదని.. అన్ని వర్గాలను కలిసి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అత్యధిక సభ్యత్వం నమోదు చేయించిన వారికే పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదుతో పాటు స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం తీసుకోవాల్సిన అంశాలపై జేపీ నడ్డా ఆరా తీసినట్టు సమాచారం.

## ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ అధ్యక్షుడిగా శ్రేయమ్స్ కుమార్

దిల్లీ: దేశంలో పత్రికలు, మ్యాగజైన్లు, పీరియాడికల్స్ పబ్లిషర్ల సమాఖ్య ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఎంవీ శ్రేయమ్స్ (మాతృభూమి) ఎన్నికయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సొసైటీ 85వ వార్షిక సాధారణ సమావేశంలో 202425 సంవత్సరానికి గాను కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రాకేశ్ శర్మ (ఆజ్ సమాజ్) నుంచి సొసైటీ అధ్యక్ష బాధ్యతలను శ్రేయమ్స్ అందుకోనున్నారు. డిప్యూటీ ప్రెసిడెంట్గా వివేక్ గుప్తా (సన్మార్గ్), వైస్ ప్రెసిడెంట్ కరణ్ రాజేంద్ర దార్డా (లోక్మత్), గౌరవ ట్రెజరర్గా తన్మయ్ మహేశ్వరి (అమర్ ఉజాలా) నియమితులయ్యారు. మేరీ పాల్ సెక్రటరీ జనరల్ వ్యవహరించనున్నారు.
నూతన కార్యవర్గం ఇదే..
ఎస్ బాలసుబ్రమణియన్ ఆదిత్యన్ (డైలీ తంతి), గిరీశ్ అగర్వాల్ (దైనిక్ భాస్కర్, భోపాల్), సంహిత్ బాల్ (ప్రగతివాడి), సముద్ర భట్టాచార్య (హిందుస్థాన్ టైమ్స్, పట్నా), హర్ముస్ట్ ఎన్ కామా (బాంబే సమాచార్), గౌరవ్ చోప్రా (ఫిల్మీ దునియా), విజయ్ కుమార్ చోప్రా (పంజాబ్ కేసరి, జలంధర్), విజయ్ జవహర్లాల్ దార్డా (లోక్మత్, నాగపూర్), జగ్జీత్ సింగ్ దార్ది (చార్దికాలా డైలీ), వివేక్ గోయెంకా (ది ఇండియన్ ఎక్స్ ప్రెస్, ముంబయి), మహేంద్ర మోహన్ గుప్తా (దైనిక్ జాగరణ్), ప్రదీప్ గుప్తా (డేటా క్వెస్ట్), సంజయ్ గుప్తా (దైనిక్ జాగరణ్, వారణాసి), శైలేష్ గుప్తా (మిడ్‌డే), శివేంద్ర గుప్తా (బిజినెస్ స్టాండర్డ్), యోగేశ్ పి జాదవ్ (పుదారి), సర్వీందర్ కౌర్ (అజిత్), ఆర్ లక్ష్మీపతి (దినమలార్), విలాస్ ఏ మరాథే (దైనిక్ హిందుస్థాన్, అమరావతి), హర్ష మాథ్యూ (వనిత), అనంత్ నాథ్ (గృహశోభిక, మరాఠి), పీవీ నిదీశ్ (బాలభూమి), ప్రతాప్ జి పవార్ (సకల్), రాహుల్ రాజ్కేవా (ది సెంటినల్), ఆర్ఎంఆర్ రమేశ్ (దినకరన్), అతిదేవ్ సర్కార్ (ది టెలిగ్రాఫ్), పార్థ బి సిన్హా (నవభారత్ టైమ్స్), ప్రవీణ్ సోమేశ్వర్ (ది హిందుస్థాన్ టైమ్స్), కిరణ్ డి ఠాకూర్ (తరుణ్భారత్, బెళగాం), బిజూ వర్గీస్ (మంగళం ప్లస్), ఐ వెంకట్ (ఈనాడు), కుందన్ ఆర్ వ్యాస్ (వ్యాపార్ జన్మభూమి), కేఎన్ తిలక్ కుమార్ (డెక్కన్ హెరాల్డ్, ప్రజావాణి), రవీంద్ర కుమార్ (ది స్టేట్స్మన్), కిరణ్ బి వడోదరియా (వెస్టర్న్ టైమ్స్), సోమేశ్ శర్మ (రాష్ట్రదూత్ సప్తాహిక్), జయంత్ మమ్మేన్ మాథ్యూ (మలయాళ మనోరమ), ఎల్ ఆదిమూలం (హెల్త్ & ది యాంటిసెప్టిక్), మోహిత్ జైన్ (ఎకనమిక్ టైమ్స్), కేఆర్పీ రెడ్డి (సాక్షి), రాకేశ్ శర్మ (ఆజ్ సమాజ్).










# మంచి సమాజ నిర్మాణం ఉపాధ్యాయుల వల్లే సాధ్యం

## ఎమ్మెల్సీ కోదండ రాం



**విశ్వంభర, చంపాపేట్:** మంచి సమాజాన్ని నిర్మించడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ఎమ్మెల్సీ ప్రో. కోదండ రామ్ అన్నారు. ట్రస్మా రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో చంపాపేట్ ఏపిఆర్ గార్డెన్స్ లో చేపట్టిన గురుపూజోత్సవ కార్యక్రమంలో పాల్గొని పలువురి ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా ట్రస్మా అధ్యక్షుడు సిద్దాల బీరప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రవేట్ ఉపాధ్యాయులను సత్కరించుకోవడం చాల సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానించుకోవడమే కాకుండా ప్రవేట్ ఉపాధ్యాయులను జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలను ఏకం చేసి ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఉపాధ్యాయులను ఒక్క చోట చేర్చి గౌరవించుకోవడం పట్ల వారికి మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సదుల మధు సుదన్ , రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ రమేష్ రావు , రాష్ట్ర ట్రెజరర్ పటోళ్ల రాఘవేందర్ రెడ్డి లు మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలు అన్ని కలిసి ట్రస్మా అనే వ్యవస్థగా ఏర్పడి ప్రవేట్ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల పై నిరంతరం పోరాడుతున్నామని అన్నారు. ప్రవేట్ విద్య వ్యవస్థలో ఉన్న అనేక సమస్యలపై కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు. ఉపాధ్యాయులకు ఉచిత వైద్యం, భీమా వంటి సదుపాయాలను కల్పించి ఆదుకోవాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించిన రంగారెడ్డి జిల్లా ట్రస్మా కమిటీ సిద్దాల బీరప్పను , సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు జిల్లా జనరల్ సెక్రటరీ ఎమ్,ఐ గుల్షాని, జిల్లా ట్రెజరర్ మల్లెల శ్రీనివాస్ రెడ్డి , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివ లింగం , జిల్లా వైస్ ప్రెసిడెంట్స్ అనంత లక్ష్మి , రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అల్లాజీ గౌడ్, సుధీర్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి అనిల్ శాండిల్య ,రంగారెడ్డి జిల్లా ప్రవేట్ పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

# భారీగా పెరిగిన నిత్యావసరాల ధరలు



**విశ్వంభర, హైదరాబాద్:** సామాన్యులకు మరోసారి బిగ్ షాక్ తగిలింది. దసరా పండుగకు ముందు నిత్యావసరాల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. నూనె ధరలు లీటర్‌పై రూ.20-45 వరకు, వెల్లుల్లి కిలో రూ.300 నుంచి రూ.360, అల్లం కిలో రూ.100 నుంచి రూ.150, ఎండుమిర్చి రూ.200 నుంచి రూ.240, పెసరపప్పు రూ.150, మినపప్పు రూ.135, కందిపప్పు రూ.150 నుంచి 175కు పెరిగాయి. ఉల్లి ధరలూ కేజీ రూ.60కి తగ్గడం లేదు. నిత్యావసరాల ధరలు భారీగా పెరడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు.

# గుండ్లపల్లిలో దారుణహత్య

## తలపై బండరాయితో కొట్టి చంపిన దుండగులు



**నల్లగొండ జిల్లా గుండ్లపల్లి(డిండి):** మండలం చెరుకుపల్లి గ్రామంలో హత్య కలకలం రేపింది. గ్రామంలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కాళ్ళు, చేతులను కట్టివేసి బండ రాయితో దారుణంగా కొట్టి చంపారు. ఘటనా స్థలానికి చేరుకున్న గుండ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

# ఎన్ఏఎస్ఎఫ్‌సీఓబీ వార్షిక సమావేశం

## పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు




**విశ్వంభర, హైదరాబాద్:** గోవా రాష్ట్రంలోని పనాజీ సిటీలో జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్ (ఎన్.ఏ.ఎస్.ఎఫ్.సీ.ఓ.బీ) వార్షిక సర్వ సభ్య సమావేశానికి కర్ణాటక, గోవా రాష్ట్రాల కో ఆపరేటివ్ మంత్రి రాజన్న, సుభాష్ శిరోద్కర్ లతో కలిసి తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ శ్రీ మార్నేని రవీందర్ రావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఏ.ఎస్.ఎఫ్.సీ.ఓ.బీ ఎండీ సుబ్రమణ్యం, చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



**విశ్వంభర, చింతపల్లి:** విప్లవవీరుడు భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు చింతపల్లి మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు వద్ద ఉత్తేజ భరితంగా జరిగాయి. శనివారం గ్రామ ప్రజలు, యువకుల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ చదువుతున్న రోజుల్లోనే జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో చలించిపోయారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాలకే ప్రాణత్యాగం చేసి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని ఈ ప్రపంచానికి పరిచయం చేశారని అన్నారు. వెన్నం శేఖర్, గోవిందు రవికుమార్, వందనపు ఆంజనేయులు, మేకల నరసింహ, బొలుసాని సత్యనారాయణ, వనం మధు, బావుండ్లపల్లి చెన్నయ్య, గోవిందు ప్రసాద్, సోమరాజు ప్రదీప్, బొడ్డు మహేష్, కందుకూరి గిరి, కొప్పుల శంకర్, గజ్జ అభినవ్, భోగరాజు అజయ్, కోడిదాల శీను, కడారి కృష్ణ, పసునూరు నాగార్జున, కంచుకట్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హి సేవా పై అవగాహన కార్యక్రమం



**విశ్వంభర, చండూర్:** స్వచ్ఛ-భారత్ స్వచ్ఛ-తెలంగాణలో భాగంగా స్థానిక చండూరు మున్సిపాలిటీలోని సన్ షైన్ హై స్కూల్‌లో పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రథమ బహుమతి స్నిఖిత, ద్వితీయ బహుమతి పార్థు నందిని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనము గురించి వివరించారు. మన పరిసరాలు స్వచ్ఛంగా ఉండడం ద్వారా మన మనసు కూడా స్వచ్ఛంగా ఉండి మన పెరుగుదలక , ఉన్నత స్థాయికి వెళ్లడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు భారతదేశాన్ని స్వచ్ఛభారత్ గా మార్చుతామని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా విద్యార్థులందరూ కలిసి భారతదేశ ఆకారంలో స్వచ్ఛత హీ సేవ S H S అక్షరమాల ఆకారంలో ఆసీనులైనారు. పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మా, ప్రిన్సిపాల్ రవి కాంత్, మున్సిపాలిటీ అధికారులు అరవింద్, యాదయ్య, విజయలక్ష్మి, లతీఫ్ పాషా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వస్తువులు ఏరి వేత కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాహత్ ఖానం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్ నిర్మూలన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ ప్రవీణ్ సింగ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిత, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ చిన్నబాబు, అధ్యాపకులు డాక్టర్ సునీత, డాక్టర్ నీలిమ, డాక్టర్ రవీందర్, డాక్టర్ రాచమల్లు శ్రీనివాస్, డాక్టర్ కిషన్, డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ రత్న మంజుల, సతీష్, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెత్త సేకరణ రిక్షాలు, వీల్ బ్యారెల్స్ పంపిణీ

## జీ.హెచ్.ఎం.సీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**విశ్వంభర,ఎల్‌బీ నగర్:** మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ కార్పొరేటర్ కార్యాలయంలో జీ.హెచ్.ఎం.సీ శానిటేషన్ సిబ్బందికి చెత్త సేకరణ రిక్షాలు, వీల్ బ్యారెల్స్ ను జీ.హెచ్.ఎం.సీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్లో ఉన్న కాలనీలు, బస్తీలను ఎప్పటికప్పుడు క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాల్సిన బాధ్యత శానిటేషన్ సిబ్బంది దేనని, మెరుగైన పనులు, సేవలు చేయడానికి చెత్త సేకరణ రిక్షాలు, వీల్ బ్యారెల్స్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. శానిటేషన్ శాఖ ఎస్ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, జవాన్ శ్రీనివాస రావు, ఎస్ఎఫ్ఏలు రవీందర్, హమీద్, సత్య నారాయణ బీజేపీ నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, మునగాల హరీష్ రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అడవుల పెంపకానికి వాసవి క్లబ్ సీడ్ బాల్స్ తయారీ



**విశ్వంభర, కల్వకుర్తి:** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు ఒక కోటి సీడ్ బాల్స్ కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారి విద్యార్థులకు సీడ్ బాల్స్ ఆవశ్యకత తెలుపుతూ నోవీస్ స్కూల్ వారి సహకారంతో పదివేల సీడ్ బాల్స్ తయారు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కల్వ హరికృష్ణ, రీజియన్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, జోన్ ఛైర్మెన్ కూన సంతోష్, వాసవి క్లబ్ ప్రెసిడెంటు చిదిరే శ్రీనివాసులు, జనరల్ సెక్రెటరీ కల్వ ఆంజనేయులు, కోశాధికారి దుగ్గీ అశోక్, స్కూల్ యాజమాన్యం బృంగి వివేకానంద, పావని దేవి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన దండుగుల ఇంద్రమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకోర్ ప్రభాకర్ రెడ్డి 3 వేల రూపాయలు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శెట్టి రాజశేఖర్ 2వేల రూపాయలు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్, డేవిడ్, రేణు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి , మట్ట అంజయ్య మాజీ సర్పంచ్ విజయమ్మ, వెంకటయ్య, దైవానందం, పవన్ వాల్మీకి, దేరంగుల శ్రీశైలం, దేశముని రాములు, ఊరుకొండ రామచంద్రి, అంజన్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రపంచ హృదయ దినోత్సవం సందర్బంగా మెడికల్ క్యాంప్



**విశ్వంభర,రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో శనివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వెల్లంకి సబ్ సెంటర్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా అక్కడికి విచ్చేసిన ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు. గుండె సంబంధిత వ్యాధుల గురించి, వాటిని ఎలా నివారించాలి అనే దానిపై అవగాహన కల్పిస్తూ, గుండెకు మంచి చేసే ఆహార నియమాలు, వ్యాయామం, గుండెకు చెడు చేసే అలవాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేయటం జరిగింది. మండ ల వైద్య అధికారి డాక్టర్ అశ్విని కుమార్, హెచ్. ఈ.ఓ గోపాల్, ఏ.ఎన్.ఎంలు రజిత, ప్రశాంతి, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భార్యాభర్తల మధ్య గొడవ, భర్త ఆత్మహత్య



**విశ్వంభర, ఆమనగల్లు:** భార్యా భర్తలు గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆమనగల్లు పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. తలకొండపల్లి మండలం జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మీసాల మహేశ్ (26) ఆమనగల్లు పట్టణంలోని శ్రీనివాస కాలనీలో నివాసం ఉంటు న్నారు. శనివారం రాత్రి అతని భార్యతో చిన్న విషయానికి గొడవపడ్డాడు. ఇద్దరు మధ్య గొడవ తారస్థాయికి చేరడంతో మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్ళి చూన్నీతో ఉరేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ఈ మధ్యనే పెళ్లి అయ్యిందని ఆరు నెలల చిన్న బాబు కూడా ఉన్నాడని కాలనీవాసులు ఆవేదన చెందారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్ పల్లి రిజర్వాయర్ నుండి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం రాజపేట మండలానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నీటిని విడుదల చేశారు. ముందుగా తపాస్ పల్లి రిజర్వాయర్ ని సందర్శించి, ఆలేరు నియోజకవర్గనికి వచ్చేటటువంటి నాగపూర్ కాల్వ వద్ద నీటిని విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ రైతులు, ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకి, ఉత్తమ్ కుమార్ రెడ్డికి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఆలేరు నియోజకవర్గ రైతులు, ప్రజలందరి తరపున, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మానవత్వం చాటుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** డబ్బా గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో తాత్కాలిక సమస్యలను గ్రామ బీజేపీ శాఖ గుర్తించింది. సమస్యల పరిస్కారానికి సెక్రటరీకి వినతి పత్రం ఇచ్చారు. కానీ గ్రామంలో పాలక వర్గం లేకపోవడంతో ఈ యొక్క సమస్య ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ యువ నాయకులు సురభి నవీన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో అంగన్వాడీ కేంద్రంలో సొంత ఖర్చులతో తాత్కాలిక మరమ్మతులు చేయించి మానవత్వం చాటుకున్నారు. తాత్కాలిక మరమత్తులు చేయించిన సురభి నవీన్ కుమార్‌కి ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# మహిళను కాపాడిన హెడ్ కానిస్టేబుల్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఒక మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు పట్టాలపై తిరుగుతున్నది. అది చూసిన మహబూబాబాద్ టౌన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ కాపాడారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో మహబూబాబాద్ లక్ష్మీపురంకు చెందిన భూక్యా మౌనిక (26) వీడియో కాల్స్ లో మాట్లాడుతూ ఏడుస్తూ పట్టాలపై వెళ్తుండగా, వెంటనే జీ.ఆర్.పీ పోలీసుల సహాయంతో ఆమెను కాపాడారు. ఆమె కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయం తీసుకుందని, ఆమెకు ఇద్దరు చంటి పిల్లలు వున్నారని తెలిసింది. మహిళను కాపాడిన హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీకి మౌనిక బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

# సంగెం గ్రామంలో నాటు కోళ్ల పంపిణీ



**విశ్వంభర, కేశంపేట:** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (డిఆర్‌డిఎ) రూపొందించిన మహిళా శక్తి కార్యక్రమాల ప్రణాళికలో భాగంగా కేశంపేట్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంగెం గ్రామంలో నాటు కోళ్ల పంపిణీ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. వారితోపాటు మండల ఎంపీడీవో, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రవణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ , మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరేశప్ప, శ్రీధర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీం, వెంకటేష్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గార్ల మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన




**విశ్వంభర,గార్ల:** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ శనివారం మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలంలో విస్తృతంగా ఆకస్మిక పర్యటన చేశారు. గుంపెళ్లగూడెం అంగన్వాడి కేంద్రం, మెడికల్ క్యాంపు, గార్ల మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జిల్లా పరిషత్ హై స్కూల్, ఎస్సీ బాయ్స్ హాస్టల్, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, పల్లె దవాఖాన, ములకనూరులోని జిల్లా పరిషత్ హై స్కూల్, మండల ప్రజా పరిషత్ హై స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీలు, బాలింతలు, పౌష్టిక ఆహారం లోపం కలిగిన పిల్లలకు షెడ్యూలు ప్రకారం వారికి కావలసిన పౌష్టిక ఆహారాన్ని (న్యూట్రిషన్ ఫుడ్) అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో సీజనల్ వ్యాధులకు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా వైద్య క్యాంపులు నిర్వహించాలన్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి ఫీవర్ తో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి వారికి మందులు అందించాలని, ముందస్తు అవగాహన కల్పించాలని అన్నారు. వసతి గృహాలలో మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్ అందించాలని సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపల్స్ , నిత్యం పిల్లలను గమనిస్తూ ఉండాలని, వైద్య ఆరోగ్యశాఖచే వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు నాణ్యమైన, మధ్యాహ్నం భోజనం, త్రాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా బోధనలు అందించాలన్నారు. మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అన్ని పనులను వెంటనే పూర్తి చేయాలి అన్నారు. పాఠశాలల్లోని క్లాస్ రూమ్, వంట గదులను, డైనింగ్ హాల్, తనిఖీ చేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో వైద్యం, విద్య, ఆరోగ్యం, సానిటేషన్, లపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు పక్క ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, ఈ కార్యక్రమాల నిర్వహణ, పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయి అధికారులను మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమించి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత వైద్య సిబ్బంది, స్త్రీ సంక్షేమ శాఖ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్స్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా భగత్ సింగ్ జయంతి



**విశ్వంభర, మెట్‌పల్లి:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మెట్ పల్లి శాఖ ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమం సందర్భంగా మెట్ పల్లి పట్టణ సంయుక్త కార్యదర్శి మంగళపల్లి మారుతి మాట్లాడుతూ భగత్ సింగ్ అతి చిన్న వయసులోనే తన ప్రాణాన్ని భారతదేశం కోసం త్యాగం చేశాడని చావంటే భయం లేనివాడని, దేశం కోసం నమ్మిన సిద్ధాంతం కోసం దేశ స్వాతంత్రం కోసం తమను ప్రాణాల సైతం వెనకాడని మహావీరుడు భగత్ సింగ్ అని మాట్లాడారు. అలాగే భగత్ సింగ్ ఉరివేసే సమయంలో భగత్ సింగ్ బ్రిటిష్ వాళ్లతో మాట్లాడుతూ నన్ను ఉరి తీయకండి కానీ నన్ను చంపండి ఎందుకంటే ఉరితీస్తే నేను నా కన్నతల్లి గుడిలో చనిపోలేను అందుకే నన్ను ముక్కలు ముక్కలుగా నరికి నా భారతదేశ భూమి పైన పడేయాలని అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పట్టణ సంయుక్త కార్య దర్శి మంగళపల్లి మారుతి, ప్రభ, రాజు, నిక్లేష్, శివ, ప్రణీత్, పాల్గొన్నారు.

# క్షయవ్యాధిపై ఇంటింటి సర్వే

## టీ.బీ నోడల్ అధికారి జయప్రకాశ్



**విశ్వంభర, రాజోలి:** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది టీ.బీ సర్వే లు చేపట్టారు. రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీ.బీ నోడల్ పర్సన్ జయప్రకాశ్ ఈ విషయాన్ని తెలిపారు. గత వారం రోజులుగా దగ్గు, జ్వరము, ఆయాసము, బరువు తగ్గడం, ఆకలి మందగించటం తదితర లక్షణాలు ఉన్న అనుమానితులను గుర్తించడానికి టీ.బీ సర్వేలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మత్తు పానీయాలు సేవించేవారు, పొగ త్రాగే వారు, రైస్ మిల్లు లో పనిచేసేవారు, పత్తి పొలాలలో పనిచేసే కూలీలు, పిండిగిర్నీ దగ్గర పనిచేసే వారు, కారం పొడి మిషన్ దగ్గర పనిచేసే వారు తప్పకుండా గళ్ళ పరీక్ష లను చేయించుకోవాలని ఆయన తెలిరారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారి వివరాలు నమోదు చేస్తున్నారని వారికి మీ వివరాలు తెలియజేయాలని ఆయన అన్నారు. ప్రతీ రోజూ గళ్ళ డబ్బాలను సేకరించి వారి వివరాలు టీ.బీ ల్యాబ్ రిజిష్టర్ లో నమోదు చేసి టి హబ్ వాహనంలో జిల్లా కేంద్రానికి తరలించడం జరుగుతుందని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలు నిర్వహించిన తరువాత గళ్ళ పరీక్షలో గానీ, ఎక్స్ రే లో గానీ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వారికి 6నెలల వరకు ఉచితంగా టీ.బీ మందులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అందుకుగాను టీ.బీ రోగి యొక్క ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్లు జీరాక్స్ కాపీ లు ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి నెల 500 రూపాయలు చొప్పున 6నెలలకు 3 వేల రూపాయలు టీ.బీ రోగి బ్యాంక్ ఖాతా నెంబరులో జమ చేస్తారని ఆయన వివరించారు. టీ.బీ మందులు క్రమం తప్పకుండా వాడాలని, మందులతో పాటుగా పౌష్టిక ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే త్వం౼గా కోలుకొని ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. టీ.బీ రోగి యొక్క అన్నీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఆయన చెప్పారు. క్షయ వ్యాధి వచ్చినంత మాత్రాన భయపడవలసిన అవసరం లేదని టీ.బీ మందులు క్రమం తప్పకుండా వాడితే త్వరగా నయం అవుతుందని రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీ.బీ నోడల్ అధికారి జయప్రకాశ్ తెలియజేశారు.

## కల్వకుర్తిలో బీసీ మహాసభ ఆధ్వర్యంలో ధర్నా

**కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**42% శాతం రిజర్వేషన్లు ప్రకటించకుంటే గల్లా పట్టి నిలదీయండి- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**బీసీ కుల గణన, బీసీ వాదంపై ప్రతిపక్షాలు అభిప్రాయం వెల్లడించాలి**



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద బీసీ మహాసభ ఆధ్వర్యంలో బీసీ మహాధర్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కామారెడ్డి సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని బీసీలకు కచ్చితంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరాలని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా బీసీ వాదం, కుల గణనపైన తమ అభిప్రాయాలను తెలియజేయాలని డిమాండ్ చేశారు. పేద వైశ్యులు, పేద బ్రాహ్మణులు, పేద రెడ్డిలు మాతో కలిసి వస్తే వారిని కూడా కలుపుకుపోతామని, వారికి కూడా నీడ కల్పిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా బీసీ కుల గణనకు బాధ్యత వహిస్తానని, బీసీ కుల గణన కచ్చితంగా చేపిస్తామని, 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే గల్లా పట్టుకొని నన్ను నిలదీయండిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బీసీలు బీసీకి ఓట్లు వేసుకున్నట్లయితే ఈ పరిస్థితి వచ్చేది కాదని రెడ్డిలను గెలిపించి వారి ఇంటి వద్ద లోన్లకు, పింఛన్లు, రేషన్ కార్డులకు బారులు తీరుతున్నామని,మన ఓట్లు మనమే వేసుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

## ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపూర్ :** తెలంగాణ ఉద్యమకారులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తొందరలో ప్రారంభించబోతున్న విడతలోనే తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారులు కట్టెల లింగస్వామి మునుగోడు శాసనసభ సభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి వినతిపత్రాన్ని అందజేశారు. 2009 నుండి 2014 వరకు జరిగిన చారిత్రక, మహత్తర తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొని అనేక కేసులకు గురై జైలు జీవితం గడిపామని కూడా గుర్తు చేసారు. ఉద్యమంలో అనేకసార్లు లాఠీచార్జీలకు గురైనామనీ , అనేక కేసులలో కోర్టుల చుట్టూ ఒక్కొక్కరం దాదాపు 11 సంవత్సరాలు తిరిగామనీ గుర్తు చేసారు. దీనివల్ల ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కున్నాము, కానీ గత ప్రభుత్వం మమ్ములను ఆదుకోలేదు కదా కనీసం గుర్తించడం కూడా గుర్తించలేదు అని ఆయన అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాక ముందు నుండి కూడా ఉద్యమకారులకు సరైన గుర్తింపును ఇస్తుంది. అట్లాగే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాల అమలులో భాగంగా తెలంగాణ ఉద్యమకారులకు కూడా ఇప్పుడు చేపట్టబోతున్న మొదటి విడతలోనే 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే నిధులను కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

## గ్రామాల అభివృద్ధి కోసం గ్రామ కమిటీలు



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపూర్ :** ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు సంస్థాన్ నారాయణపురం మండలంలో రాచకొండ ఉమ్మడి గ్రామపంచాయతీ వెంకం బావి తండా గ్రామాలలో బూతు స్థాయిలో గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కరెంటు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ సంక్షేమ సామాజిక పథకాలు ప్రజలకు గ్రామాల వారుగా చేరవేసే విధముగా గ్రామ అభివృద్ధి కమిటీలు వేయడం జరుగుతుందని అన్నారు . ప్రతి ఒక్కరు భాగస్వామ్యం ప్రభుత్వ విధానాలను, ప్రజాపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా మాట్లాడారు . స్వచ్ఛందంగా తండాలలో నాటు సారా మద్యపానం నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, డిసిసి ప్రధాన కార్యదర్శి కరెంటోతు బిక్షపతి నాయక్, డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్, సీనియర్ నాయకులు దోనూరు జైపాల్ రెడ్డి, కట్రోత్ సాగర్ నాయక్, కాట్రోత్ శ్రీను, పానుగోతూ బాలు నాయక్, కరెంటోతు రమేష్ నాయక్, కాట్రోత్ సేవా నాయక్, రఘు నాయక్, కే లోతు రమేష్ రవీందర్ జరుపల జగన్ నాయక్ వినోద్ కుమార్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య ప్రజల సంక్షేమమే ఆమ్ ఆద్మీ పార్టీ లక్ష్యం

**ఆప్ కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్**



**విశ్వంభర, బషీర్ బాగ్ :** దేశంలోని సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ పని చేస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సామాన్య ప్రజల కోసం చేస్తున్న కృషిని చూసి చాలామంది ఆకర్షితులై దేశవ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరుతున్నారని అన్నారు. ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం వైస్ చైర్మన్, బహదూర్ పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కలీం బాబా తోపాటు నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సయ్యిద్ షా, ఎండి. రహీం, అక్బర్, నూర్ అన్వార్, మజీద్, అత్తార్ తదితరులు డాక్టర్ దిడ్డి సుధాకర్ సమక్షంలో ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ పార్టీ వారికీ పార్టీ ఖండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం, ఆయన బృందం కృషి వల్ల ఢిల్లీలో జరిగిన అభివృద్ధి తోపాటు మెరుగైన నిజాయితీ గల ప్రభుత్వా పనితీరు దేశవ్యాప్తంగా ఒక పెద్ద విప్లవాన్ని తీసుకువచ్చిందన్నారు. దాని ప్రభావంతో వివిధ పార్టీలకు చెందిన వ్యక్తులు ఆమ్ ఆద్మీ పార్టీలోకి నిరంతరం చేరుతున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వేగంగా విస్తరిస్తుందని, పార్టీ నాయకులూ, కార్యకర్తలు ఇంకా కస్టపడి క్షేత్ర స్థాయి నుండి బలోపితం చేయాలనీ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. అనంతరం కలీం బాబా మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీకి తాను సైనికుడిగా మారబోతున్నందుకు గర్వంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. సోలొమన్ రాజ్, ఎంఎ. మజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు జిల్లోజు హేమ, అధికార ప్రతినిధులు ఆఫస, జావీద్ షరీఫ్, దివ్యంగా విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోమియో రమేష్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ భాగతసింగ్ కాలనిలో రోమియో రమేష్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యువ కిశోరం, భరతమాత స్వేచ్ఛ కోసం ఉరికంబాన్ని ఆనందంగా ముద్దాడిన వీరతేజం అని కొనియాడారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ భారతీయుల గుండెల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన సింహనినాదమని చెప్పారు. అలాగే "నన్ను చంపగలరు కానీ నా ఆలోచనలను చంపలేరు" అంటూ ఆంగ్లేయుల గుండెల్లో భయాన్ని పుట్టించిన విప్లవ కెరటం అంటూ కొనియాడారు. కార్యక్రమంలో రోమియో రమేష్, బాస రాజు, నదికూడా నర్సింలు, నడికూడ రాజు, ఎం.శ్రీను, చెన్న బాలరాజు, రాజేశ్వర్ రెడ్డి, మేడిపల్లి సుధాకర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

## హైడ్రా పేరుతో సర్వేలు, కూల్చివేతల పై మాజీమంత్రి జగదీష్ రెడ్డి మండిపాటు



**విశ్వంభర, సూర్యాపేట:** హైడ్రా పేరుతో సూర్యాపేట సహా రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న సర్వేలు, కూల్చివేతల పై మాజీమంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పాములా బుసలు కొట్టి విధ్వంసం సృష్టిస్తుందని, బాధ్యత లేకుండా అర్థంలేని పనులతో ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నారని విమర్శించారు. నెరవేర్చని హామీలపై ప్రజలు తిరుగుబాటు చేస్తారని అణచివేసే కుట్ర చేస్తున్నారన్నారు. నీటి వనరుల సంరక్షణ తోపాటు ప్రభుత్వం అక్కడి ప్రజల బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు అనుమతులిచ్చాకె ప్రజలు అక్కడ నివసిస్తున్నారని. ఇప్పుడు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ల సర్వే, కూల్చివేతలు అంటూ మూరంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ట్యాంక్ బండ్ ఉన్న ప్రాంతాల్లో కూడా అనవసర భయాలు సృష్టిస్తున్నారని. కేవలం సూర్యాపేటలో 1000 కోట్ల నష్టం జరిగేలా ఉందని తెలిపారు. పేద ప్రజలపై ప్రభుత్వ దమనకాండ సాగనివ్వమని, ప్రాణం పోయినా ప్రభుత్వ దుర్మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజల పక్షాన నిలబడతాం తప్పు ప్రభుత్వం చేస్తే శిక్షలు ప్రజలకా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పనికిమాలిన పనుల పై న్యాయ పోరాటం చేస్తాంమని, తక్షణమే చెరువుల ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ల పై శాస్త్రీయ నిర్ణయం చేయాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచించారు.

## అక్రమ ఇసుక రవాణా లారీ ఓనర్ అరెస్ట్




**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ యమ్నంపేట క్రాస్ రోడ్ వద్ద స్టేట్ స్పెషల్ విజిలెన్స్ టీం వాహన తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో అక్రమ లారీ వాహనం టీఎస్07 యు ఎన్ 0963 నెంబర్ ప్లేట్ తో వస్తున్న లారీని పోలీసులు ఆపి పరిశీలించారు. ఈ వాహనం డాక్యుమెంట్ పరిశీలించగా మరో వాహనపు నెంబర్ టీజి3 0టి 2345 గా పోలీసులు తెలిపారు. వెంటనే ఇసుక రవాణా చేస్తున్న గౌతమ్ ను, ఆ లారీని అదుపులోకి తీసుకొని, ఒక వాహనానికి మరొక వాహనం నెంబర్ పెట్టి చలామణి అవుతున్న లారీ డ్రైవర్ గౌతమ్ నీ , లారీ యజమాని పై మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రావు కేసు నమోదు చేసారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని పోలీసులు తెలిపారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్ ఖాన్ గూడ కు చెందిన టిపిపిసి ఎస్సీ సెల్ కన్వీనర్ వల్లమాల డీజే ప్రవీణ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవస్థానంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శించుకుని కాలనీ వాసులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హి సేవ



**విశ్వంభర, నల్గొండ జిల్లా :** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య పరీక్షలు నిర్వహణ చేపట్టారు. త్రిపురారం గ్రామపంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హి సేవ 2024 లో భాగంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వతారీఖు వరకు జరిగేటటువంటి కార్యక్రమంలో త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బందికి డాక్టర్ శంకర్ నాయక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో త్రిపురారం గ్రామపంచాయతీ లోని సిబ్బంది, అంజన పల్లి గ్రామపంచాయతీ సిబ్బంది , నీలయగూడెం గ్రామపంచాయతీ సిబ్బంది సుమారు 20 మంది హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి రక్త పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ నాయక్ పంచాయతీ కార్యదర్శి కోడి రెక్క రాజేంద్ర కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకయ్య, హెల్త్ అసిస్టెంట్ పుట్ట గోపాల్ రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పర్మిషన్లు లేకుండా ఇసుక అక్రమ రవాణా

### సీసీ రోడ్లకైతే ఇసుక అనుమతులు వద్దా



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెంలో సీసీ రోడ్లకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గత మూడు రోజుల నుండి రాత్రిపూట ఎండ్లబండ్లతో దోబి ఘాట్ వద్ద డంప్ చేసి ప్రతి రోజు ఉదయం ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుకను రవాణ చేస్తుంది లోకల్ కాంట్రాక్టర్లు కావడంతో ఇలా యథేచ్చగా పర్మిషన్లు లేకుండా తరలించడం జరిగుతుంది. మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్లు పనులు జరుగుతున్నాయి. వీటికి మాత్రం ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకుని మూసి వాగు నుండి ఇసుక రవాణ చేసి పనులు చేస్తున్నారు. ఇదే విషయం పై ఎమ్మార్వో రాంప్రసాద్ ను వివరణ కోరగా మోత్కుర్ బిక్కురు వాగు హైకోర్టులో పిటిషన్ ఉన్న కారణంగా నేను ఎవరికి ఏలాంటి పర్మిషన్ ఇవ్వలేదు, ఎవరైనా అలాగే ఇసుక అక్రమ రవాణా చేస్తే పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వండనీ తెలిపారు. మోత్కుర్ ఎస్ ఐ నాగరాజు మాట్లాడుతూ మోత్కుర్ బిక్కురు వాగు నుండి ఇసుక దోబీ ఘాట్ వద్దకు ఎడ్లబండ్లతో తరలిస్తూ అక్కడ డంప్ చేస్తున్నారని సమాచారం వచ్చిందని వెంటనే మోత్కూర్ మేనేజర్( మున్సిపల్ కమిషనర్)ను అడగగా వారు మాకు లెటర్ పంపుతాము అని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఏలాంటి లెటర్ మాకు ఇవ్వలేదు అని తెలిపారు.

## అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

### మున్సిపల్ కమిషనర్ వసంత



**విశ్వంభర, ఆమనగల్లు:** స్వచ్ఛతా హి సేవా 2024లో భాగంగా ఆమన్‌గల్ మున్సిపాలిటీలోని మున్సిపల్ నర్సరీలో నిర్వహించిన ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వసంత పాల్గొని మొక్కలు నాటారు. ఆమె మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని దానిని సంరక్షించి పెద్దగా చేయడం వల్ల భవిష్యత్ తరాలు నిలబడతాయని అన్నారు. మేనేజర్ సత్యనారాయణ, ఎల్లయ్య, మహ్మద్, వార్డు అధికారి, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల కోసమే మూసీ అభివృద్ధి చేస్తున్నాం




- నీటిని శుద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం
- దీనికోసం రూ. 3800 కోట్ల వ్యయం చేస్తున్నాం
- బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇండ్లను ఎప్పటికైనా తొలగించాల్సిందే
- మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం
- డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయిస్తాం
- హైడ్రాపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాన కిశోర్

**హైదరాబాద్ :** మూసీ నది ప్రక్షాళనలో భాగంగా బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇండ్లను ఎప్పటికైనా తొలగించాల్సి ఒదేనని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిశోర్ స్పష్టం చేశారు. ప్రజల కోసమే మూసీ ప్రక్షాళన చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. మూసీ, హైడ్రాపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాన కిశోర్ మాట్లాడారు. గతంలో మూసీకి భారీగా వరదలు వచ్చేవి. ఆ వరదల సమయంలోనూ నిర్వాసితులను తరలించారు. గతంలో మూసీ సుందరీకరణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పలు సూచనలు చేశారు. 1927లో వరదల వల్ల భారీ నష్టం జరిగింది. ఇటీవల భారీ వర్షాలు కురిసి హైదరాబాద్ మునిగిపోయింది. మొన్న దాదాపు 9 సెం.మీ. పైగా వర్షాలు హైదరాబాద్‌లో కురిశాయి. చిన్న వర్షానికే సచివాలయం ముందు వరద పోటెత్తింది. భారీ వర్షపాతం నమోదైతే అధికారులు కూడా ఏం చేయలేరు. ప్రజల కోసమే మూసీ అభివృద్ధి చేస్తున్నాం. మూసీ నది సుందరీకరణ కోసం ఈ చర్యలు తీసుకోవడం లేదు. మూసీ వరదల వల్ల బాధపడేది ప్రజలే. ఈ సిటీని ఇంకా ముందుకు తీసుకెళ్లాలని సీఎం నిర్ణయించారు. చారిత్రాత్మక ప్రదేశాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని దాన కిశోర్ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం కోటి జనాభా ఉంది. మూసీ పరివాహ ప్రాంతం మురికి కూపంలా మారింది. మూసీకి వరదలు వేస్తే ఇబ్బందులు పడేది ప్రజలే. మూసీ పరిధిలోని ఎమ్మెల్యేలను తీసుకొని క్షేత్ర పర్యటనకు వెళ్తాం. 2030 కల్లా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ 250 బిలియన్ డాలర్లకు చేరుతుంది. మూసీలోకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మూసీకి వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు రూ. 3800 కోట్ల వ్యయం చేస్తున్నాం. 2026 జూన్ లోపు మూసీలో మంచినీళ్లు ప్రవహించాలని సీఎం ఆదేశించారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇళ్లను ఎకప్పటికైనా తొలగించాల్సిందే. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయిస్తాం. మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని దాన కిశోర్ అన్నారు.

**దీనిపై తప్పకుండా సరైన సమయంలో స్పందిస్తాం...**

మూసీ నది ప్రక్షాళన కోసం ఆ నది పరివాహక ప్రాంతంలో ఉన్న నివాసితులను వేరే ప్రాంతాలకు తరలిస్తున్న సంగతి తెలిసిందే.ఎంజీబీఎస్ వద్ద మూసీలోనే మెట్రో రైలు స్టేషన్ నిర్మించారు. అయితే మూసీ నదిలో ఉన్న ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిశోర్ కీలక సమాధానం ఇచ్చారు. మూసీలో ఉన్న ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ గురించి కూడా చర్చించి తగిన రీతిలో స్పందిస్తాం. ఈ మెట్రో స్టేషన్‌పై ఎన్జీవోలు కూడా మమ్మల్ని అడిగారు. అది కొంచెం సీరియస్ అంశం. ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు దాన కిశోర్. ప్రయివేటుకు సంబంధించిన అక్రమణలను తొలగిస్తున్నారు కదా.. మరి గవర్నమెంట్ ఆస్తుల విషయంలో గవర్నమెంట్ ఎలా రియాక్ట్ కాబోతుందన్న ప్రశ్నకు.. చర్చలు జరుగుతున్నాయి. ఎన్జీవోలు కూడా అదే అడిగారు. దీనిపై తప్పకుండా సరైన సమయంలో స్పందిస్తాం అని దాన కిశోర్ బదులిచ్చారు.

## ప్రైవేట్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్సీ కోదండరామ్




**విశ్వంబర, ఎల్ బినగర్:** రాష్ట్రంలో ప్రవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం చంపాపేటలోని ఓ పంక్షన్ హాల్ లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ( ట్రస్మా) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిద్దాల బీరప్ప ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకను నిర్వహించారు. ఎమ్మెల్సీ కోదండరాం ముఖ్యఅతిథి హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు ప్రధానోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రవేట్ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రవేట్ టీచర్ల విలువైందన్నారు. ప్రవేట్ పాఠశాల యాజమాన్యా లు ముందుకు అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని వారి టీచర్లను సన్మానించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సద్దుల మధుసూదన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, పి.రాఘవేందర్ రెడ్డి, పల్లె వినయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యం.ఐ. గుల్షాని, శ్రీనివాస్ రెడ్డి, అల్లాజీ గౌడ్, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 117 వ జయంతి వేడుకలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య సరూర్ నగర్ మండల ఆధ్వర్యంలో భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా సాగర్ రోడ్ నవీన కళాశాల ముందు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సరూర్ నగర్ మండల కార్యదర్శి వినోద్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడు విప్లవ వీరుడు ,ఇంకీలాబ్ జిందాబాద్ అను నినాదానాలతో ఆంగ్లయులను వణికించిన భగత్ సింగ్ చిన్న వయసులోనే దేశంకోసం ఉరి తీయపడ్డాడు .వారి యొక్క మరణాన్ని అధికారికంగా ప్రకటించాలని వారి ఆశయాల కోసం మనం పోరాటం చేయాలనీ ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యముషాలలో చేర్చాలని అని అన్నారు. విద్యార్థులు భగత్ సింగ్ చరిత్ర తెలుసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ ,ఉపేందర్, మహేష్ ,శివ, నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

## సమస్యలు తీరాలంటే మరిన్ని ఐక్య ఉద్యమాలు చేయాలి

### ప్రధాన కార్యదర్శి వెంకటప్ప



**విశ్వంభర, ఎల్బీనగర్:** సమస్యలు తీరాలంటే మరిన్ని ఐక్య ఉద్యమాలు చేయాలి అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. సరూర్నగర్ మండల సభ్యత్వం క్యాంపియన్ రెండవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్ ఎల్బీనగర్ ప్రాథమిక పాఠశాల, చంపాపేట్ పాఠశాలలో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులను గమనిస్తే మన రాష్ట్రంలో విద్యారంగం అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉందని అందుకు ఉపాధ్యాయులు అందరూ తమ శక్తి వంచన లేకుండా సంఘాల పిలుపులకు స్పందించి పోరాటాల్లో ముందుండాలని అని అన్నారు .ఆ పోరాటాలకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముందుండి నాయకత్వ బాధ్యతలను తీసుకుంటుందని చెప్పారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పనితీరు కాస్త మెరుగ్గానే ఉందని అన్నారు. గత పిఆర్సి, ఏరియాస్ బిల్లులు జారీ చేయడం నూతనంగా రాష్ట్రంలోని అన్ని మండలాలకు ఎంఈఓ లను కేటాయించడం చాలా మంచి పరిణామం అని అన్నారు .గత పోరాటాలు స్ఫూర్తితో మరిన్ని సంఘటిత ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది అని ఉపాధ్యాయులు తమ హక్కులు మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా నిర్వర్తించాలని అన్నారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల మనుగడ సులువు అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు రామావత్ తావూరియా నాయక్, ప్రధాన కార్యదర్శి మల్లేష్ , జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి, కిషన్ నాయక్ ,కల్లెష్ రాజు ,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మూసీ నదిలో, బఫర్ జోన్‌లో ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మాణం చేసి ఇవ్వాలి




**విశ్వంభర, ఎల్బీనగర్:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి బృందం శనివారం ఎల్బీనగర్ లోని మూసి పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత పేదలు మధ్యతరగతి వారు అనేక సంవత్సరాల నుండి ఇక్కడ నివాసం ఉంటున్నామని ఈ నివాస ప్రాంతాలను ఖాళీ చేయాలని చెప్పి ప్రభుత్వము గుర్తులు వేసి పోయిందని కానీ మాకు ఎలాంటి నష్టపరిహారం కానీ ఇండ్లు కానీ నిర్మించి ఇవ్వకుండానే ఖాళీ చేయమంటున్నారని భవాని నగర్ కాలనీవాసులు తమ గోడును వెళ్ళబుచుకున్నారు. ఒక బజారులో 21 ఇల్లు ఉండగా అందులో ఆరుగురు పేర్లు మాత్రమే రాసుకోనిపోయి పోయినారని కోటేశ్వరమ్మ అనే మహిళ గుడిసె వాసి వారి గోడుని వెలుగుచ్చారు. వీరందరికీ కూడా డబల్ బెడ్ రూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మూసి పక్కన అతి తక్కువకు అద్దెలకు వస్తున్నాయని చెప్పి పదిహేను 20 సంవత్సరాల నుండి అద్దె ఇంట్లో నివాసము ఉంటున్న వారికి ప్రభుత్వము వారి పేర్లు నమోదు చేసుకొని వారికి కూడా ఇల్లు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. అద్దె ఇళ్లలో ఉన్న వారికి కూడా ప్రభుత్వము ఇండ్లు నిర్మాణం చేసి ఇల్లు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. మూసి పరివాహక ప్రాంతం కాలనీ వాసులకు తగిన నష్ట పరిహారం ఇచ్చి, ఇల్లు నిర్మాణం చేపట్టి ఇవ్వాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సర్కిల్ సర్కిల్ నాయకులు ఎం వీరయ్య, సి మల్లేష్ తదితరులు పర్యటించారు.

## రాజీ మార్గమే రాజా మార్గం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి




**విశ్వంభర , ఎల్బీనగర్:** రాజీ మార్గమే రాజా మార్గం అని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ , రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోగల అన్ని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడమైనది.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ జాతీయ లోకాదాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోకదాలత్ లో సెటిల్ చేసుకోవడం ద్వారా తాము సివిల్ కేసులలో చెల్లించిన కోర్ట్ ఫీస్ కూడా తిరిగి పొందొచ్చు అని చెప్పారు. తమ కేసులను అనగా ఆస్తి పరమైన కేసులు , కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్ , మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు. రంగారెడ్డి జిల్లా రాష్ట్రము లో ప్రథమ స్థానం లో ఉండాలి అని ఆశించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి మాట్లాడుతూ రంగా రెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాలలో 33 లోక్ అదాలత్ బెంచిలుఏర్పాటు చేశామని ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు ,సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్జ్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకొన్నారు అని చెప్పారు. ఈ లోక్ అదాలత్ నిర్వహించుటలో పోలీస్ వారు, ఇన్సూరెన్స్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పానెల్ అడ్వొకేట్స్ తమవంతు సహాయస హకారాలను అందించారు కక్షిదారులు సంతోషం వ్యక్త పరిచారు ఇందులో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాదభీమా కేసులు, బ్యాంకు రికవరీ మరియు ప్రీలిటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 1,50,000 పైచిలుకు కేసులు పరిష్కరిం చబడ్డాయి. అలాగే అన్ని కేసులలో కలిపి రూ.11,86,66,443 రూపాయల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగింది. అలాగే ట్రాఫిక్ కేసులలో Rs.5,26,39,199/- ప్రభుత్వానికి ఇప్పించడం జరిగినది.

## హైడ్రా కూల్చివేతలు అన్యాయం, బాధితులకు అండగా ఉంటాం

### పేదలు, మధ్య తరగతి నివాసాలపై ప్రతాపం చూపడం సరికాదు

### పేదల ఇళ్లను కూలిస్తే చూస్తూ ఊరుకోం: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో సామాన్య ప్రజల్లో భయం సృష్టిస్తోందని అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మండిపడ్డారు. సామాన్య ప్రజలను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోమని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం గోల్నాక డివిజన్ లోని న్యూ తులసి రామ్ నగర్ (లంక) మూసీ బాధితులను ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజలు నిర్మించుకున్న నివాసాలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. భూ కబ్జాదారులకు, ల్యాండ్ మాఫియాలకు, పైరవీకారులకు అండగా ఉంటూ పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని, పేదల ఇళ్లు కూలగొట్టి వారి బతుకుల్లో మట్టికొట్టే దుర్మార్గానికి ఒడిగట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమయంలోనైనా ఏ అవసరమున్నా ఫోన్ చేస్తే అందుబాటట్లో ఉంటానని నిర్వాసితులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భరోసా ఇచ్చారు.

## జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రభుత్వ జూనియర్ కళాశాల, మహబూబాబాద్ పట్టణంలో శనివారం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యువజన ఉత్సవాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పోముఖ్యఅతిథిగా పాల్గొనీ జ్యోతి ప్రజ్వలన చేశారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, అందులో భాగంగానే జిల్లాలో కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు.15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల వయసు కలిగిన యువతీ, యువకులు ఈ పోటీలో పాల్గొనడం జరుగుతుందని, ఆరు విభాగాలలో ఫోక్ సింగింగ్, డాన్సింగ్, వ్యాసరచన పోటీలు, సోలో పర్ఫామెన్స్, లైవ్ కార్యక్రమాలు నిర్వహించి యువతలోని ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయికి ఉత్తమ ప్రదర్శనలు పంపడం జరుగుతుందన్నారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. విద్యార్థిని విద్యార్థులు ప్రతిభను నైపుణ్యతలను వెలికితీ యాలని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యా బోధనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ గ్రౌండ్ వాటర్ సురేష్, జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి అనిల్ కుమార్, డిఇఓ వి. రాజేశ్వర్, సైన్ అధికారి, సంబధిత అధికారులకు పాల్గొన్నారు.

## గోశాలకు పశు దాణా వితరణ



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలకు శనివారం దాతలు పశు దాణా(కుట్టి) వితరణ చేశారు. సోలిపూర్ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు పంతులు పది వేలు రూపాయలు, మోతీ ఘనపూర్ లోని నవదుర్గ కంపెనీ మేనేజర్ బొలారాం పది వేలు పశు దాణా కోసం ఆర్థిక సహాయం చేశారు. వారి ఆర్థిక సహాయంతో శనివారం గోవులకు ఒక లోడు పశు దాణా (కుట్టి)ని అందజేశారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు శ్రీశైలం గౌడ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సృజనాత్మ కథను వెలికి తీయడానికి మేళాలు దోహదపడతాయి

### పేట మండల విద్యాధికారి వెంకటేశం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి విద్య వైజ్ఞానిక మేళాలు ఎంతో దోహదపడుతాయని మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట లోని మంథని పాఠశాలలో నిర్వహించిన విద్యార్థులు ప్రదర్శించిన మేళాను ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగివున్న విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ నాగనాథరావు, వినోద్, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## గ్రాండ్ మాస్టర్స్‌కు సన్మానం




**విశ్వంభర, షాద్ నగర్ :** చెస్ ఒలంపియాడ్‌లో బంగారు పథకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులైనటువంటి అర్జున్ ఇరిగేశ్రీ, ద్రోణవల్లి హారికలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రమంలో ఘన స్వాగతం పలికారు. షాద్ నగర్ చెస్ అకాడమీ నిర్వాహకుడు చెస్ రాష్ట్రస్థాయి క్రీడాకారుడు వారణాసి జగన్, షాద్ నగర్ చెస్ అకాడమీ తరపున పట్టణానికి చెందిన చెస్ క్రీడాకారుల తరపున శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. చెస్ నిర్వాహకులు జగన్ మాట్లాడుతూ 45వ పీడే పోటీల్లో భారత్ తరపున పురుషుల విభాగంలో స్వర్ణం సాధించిన గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేశ్రీ , మహిళల విభాగంలో తొలి స్వర్ణం సాధించిన పద్మశ్రీ, గ్రాండ్ మాస్టర్ హారికలకు తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రానికి కాకుండా దేశానికి స్వర్ణం సాధించి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన అర్జున్ ఇరిగేశ్రీ, ద్రోణవల్లి హారికలు మనందరికీ ఎంతో ఆదర్శమని వీరి విజ యం మనందరికీ స్ఫూర్తిదా యకమని భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. వారు ఇరువురు స్వర్ణం సాధించారంటే దానికి అకుంఠిత దీక్ష పట్టుదల కావాలని రాత్రింబవళ్లు అహర్నిశలు శ్రమించి లుగా భారతదేశ గర్వించదగ్గ చెస్ క్రీడాకారులుగా ఎదగ డం భవిష్యత్ తరాలలో చెస్ క్రీడను అభ్యసించి మాలాంటి వారందరికీ మీరు విజయం స్ఫూర్తిదాయకమని అన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

**విశ్వంభర, ఆమనగల్లు:** జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమనగల్ సివిల్ జడ్జి కోర్టులో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాటం స్వరూప ఆధ్వర్యంలో ఆమనగల్ ,మాడుగుల, కడ్తాల్, తలకొండపల్లి ,పోలీసులకు సంబంధించినటువంటి కక్షిదారుల మధ్య ఉన్నటువంటి 153 కేసులు పరిష్కారమయ్యావని ఆమనగల్ ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ ఏపీపీ బి కార్తీక్, నాలుగు పోలీస్ స్టేషన్ సంబంధించిన సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# అఖిలపక్షంతో సంప్రదించాకే మూసీపై ముందుకెళ్లాలి: హరీశ్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు ఉండాలని, వారి గోసలు కాదని చెప్పారు. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. మీ సోదరుడికి నోటీసులు ఇచ్చి, పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల ఇండ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. సీఎం రేవంత్ అనాలోచిత నిర్ణయాలతో పాలన చేస్తున్నారని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న అంశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. ప్రజలు రోగాలబారిన పడుతున్నప్పుడు వాటిపై దృష్టి పెట్టే ఆలోచన ముఖ్యమంత్రి చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ ఖ్యాతిని సీఎం రేవంత్ దెబ్బ తీస్తున్నారని చెప్పారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాతే మూసీపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కూకటపల్లిలో హైడ్రా బాధితురాలు బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, అది రేవంత్ రెడ్డి చేసిన హత్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెండ్లిళ్లు చేసిందని, ఆ ఇల్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏం అవుతుందని బాధతో ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. మొన్న కూడా ఒక ఆమె ఇల్లు కూలగొట్టే సరికి గుండె పోటుతో చనిపోయిందన్నారు. ఇవన్నీ రేవంత్ రెడ్డి పిచ్చి నిర్ణయాల వల్లే జరుగుతున్నాయన్నారు. రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల ప్రచారంలో బుల్డోజర్ రాజ్ నహి చలేగా అంటూ ప్రచారం చేస్తున్నాడని, మరి తెలంగాణలో ఏం జరుగుతున్నదని ప్రశ్నించారు. నేడు తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుందన్నారు. ముందు తెలంగాణకు వచ్చి బుల్డోజర్లు ఆపి ఆ తరువాత బుల్డోజర్ రాజ్ నహి చలేగా అంటూ ఇక్కడ ప్రచారం చేయాలన్నారు. హైడ్రా బాధితులంతా తమ కుటుంబ సభ్యులని, మీకోసం తెలంగాణ భవన్ తలుపులు ఎప్పుడు తెరిచే వుంటాయన్నారు. ఎప్పుడైనా రావచ్చని, తాము మీ వెంటే ఉంటామని భరోసానిచ్చారు. బాధితులకు రక్షణ కవచంలా ఉంటామని చెప్పారు. లీగల్ సెల్ బాధితులకు అండగా ఉంటుందని చెప్పారు.

# దుష్ప్రచారం ఇకనైనా ఆపండి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం పై కూటమి ప్రభుత్వం చేసిన కుట్ర రాజకీయాలకు నిరసనగా ఆదివారం రోజు తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు మాజీ టిటిడి లోకల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ వడ్లోజువెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పడ్డాక 100 రోజులు పూర్తయిన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టి మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ ఒక్కొక్కటిగా చేస్తూ అందులో భాగంగానే కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రసాదం లడ్డుపై కల్తీ జరిగిందని విమర్శిస్తూ, అందుకు బాధ్యులు గత ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బురద జల్లడం విడ్డూరంగా ఉంది అని ఆయన అన్నారు. అలాగే తిరుమల క్షేత్రం వివరాలపై లడ్డు ప్రసాదం పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తిరుమల దర్శనంపై ప్రభుత్వ అధికార పక్షం చేస్తున్న దుష్ప్రచారం ఇకనైనా ఆపాలని వడ్లోజు వెంకటేష్ ఆరోపించారు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా వైఎస్ఆర్సిపి నాయకులు సురవి వెంకటేష్ గౌడ్, కౌకుంట్ల రాజశేఖర్ రెడ్డి, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాల విముక్తి కోసం మహా ధర్నా

**విశ్వంభర, రామన్నపేట :** సెప్టెంబర్ 23వ తేదీ తిరుపతిలో జరిగిన విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ మార్గదర్శక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం హిందూ దేవాలయాలను ప్రభుత్వ కబంధహస్తాల నుంచి విముక్తం చేయడం కోసం, దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా, సెప్టెంబర్ 30వ తేదీ రామన్నపేట మండల విశ్వహిం దూ పరిషత్ మండలాధ్యక్షులు కొండూరు శంకర్, వలిగొండ, రామన్నపేట మండలాల ప్రఖండ అధ్యక్షులు నోముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హిందూ బంధువులందరితో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ను ముట్టడికి కలెక్టరేట్ వద్ద ఉదయం 9 గంటలకు ధర్నాకి పిలుపునిస్తున్నట్టు రామన్నపేట మండల విశ్వహిందూ పరిషత్ మండలాధ్యక్షులు కొండూరు శంకర్, వలిగొండ, రామన్నపేట మండలాల ప్రఖండ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

# త్వరలోనే పూర్తిస్థాయి పీసీసీ కార్యవర్గం

## టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఇటీవలే రాష్ట్ర పీసీసీ అధ్యక్షత బాధ్యతలు స్వీకరించిన మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఫోకస్ పెట్టారు. త్వరలోనే పీసీసీ కార్యవర్గంగా పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. త్వరలోనే కొత్త కార్యవర్గం ప్రకటిస్తామన్నారు. త్వరలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులను నియమిస్తామని చెప్పారు. పీసీసీ కార్యవర్గం తర్వాత డీసీసీ అధ్యక్షుల అంశాన్ని గురించి చర్చిస్తామన్నారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో బీసీలకు తగినన్ని సీట్లు ఇవ్వలేకపోయామని అప్పుడు గెలుపే లక్ష్యంగా పని చేశామన్నారు. 'స్థానిక' ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు బీసీలకు న్యాయం చేస్తామన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికతో స్థానిక నేతలు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కొత్త పాత నేతల మధ్య సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నట్లు నూతన పీసీసీ అధ్యక్షుడు మహేశ్?కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైడ్రా, మూసీ అభివృద్ధితో సామాన్యులకు కొంత ఇబ్బంది అయినా హైదరాబాద్ నగర ప్రజల మొత్తానికి లాభం జరుగుతుందని ఆయన తెలిపారు. పీసీసీ కార్యవర్గంలో మూడు నుంచి అయిదు వర్కింగ్ ప్రెసిడెంట్ల పదవులు ఉంటాయని ఆయన వెల్లడించారు. పాత పీసీసీ కార్యవర్గం, నూతన పీసీసీ అధ్యక్షుడి నియామకంతో రద్దు అయ్యిందని, పీసీసీ కార్యవర్గాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల పదవులు రద్దు కావన్న మహేశ్?కుమార్ గౌడ్, పీసీసీ కార్యవర్గం తర్వాత డీసీసీ అధ్యక్షుల గురించి ఆలోచిస్తామని తెలిపారు. హైదరాబాద్ నగర కాంగ్రెస్‌లో మార్పులు, చేర్పులు ఉంటాయని ఆయన వివరించారు. ఇన్ని రోజులు మల్లన్న సాగర్ బాధితుల కన్నీళ్లు హరీశ్?రావుకు కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులను పరామర్శించేందుకు తాము వెళ్తే, తమను బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్ట్ చేసిందని దుయ్యబట్టారు. డీసీసీలుగా ఎమ్మెల్యేలకు బాధ్యతలు ఇవ్వాలనే ప్రతిపాదన కూడా వచ్చినట్లు ఆయన వివరించారు. మరోవైపు గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్?కుమార్ గౌడ్‌తో, 2017 గురుకుల వ్యాయామ ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. ఉపాధ్యాయ నియమాకాలపై తమ సమస్యను విన్నవించారు. ఇప్పటి వరకు తమకు నియామక పత్రాలు ఇవ్వలేదని, ఇప్పించేట్లు చూడాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మహేశ్?కుమార్ గౌడ్ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి నియామక పత్రాలు ఇచ్చేలా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారులు కూడా సానుకూలంగా స్పందించడంతో, చొరవ చూపిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు, సీఎం రేవంత్ రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# హైడ్రా బూచి కాదు... బాధ్యత, భరోసా

## కమిషనర్ రంగనాథ్



**విశ్వంభర, హైదరాబాద్:** నదులు, చెరువులు, నాలాలు ప్రజల ఆస్తులేనని వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రజల ఆస్తులను పరిరక్షించే బాధ్యత తమపై ఉందని వెల్లడించారు. పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం మన హక్కు అని, ప్రజల ఆస్తులను రక్షించాలని రాజ్యాంగంలోనే ఉందని వెల్లడించారు. పేదలను ఇబ్బంది పెట్టాలనేది హైడ్రా అభిమతం కాదన్నారు. కొన్ని కట్టడాలు కూల్చితే హైడ్రా బాగా పనిచేస్తుందని కితాబిచ్చారని.. ఇప్పుడేమో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకే సీఎం హైడ్రాను తీసుకొచ్చారని రంగనాథ్ స్పష్టం చేశారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యతనని వెల్లడించారు. అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఓ ఆసుపత్రిపై అధికారులు గతంలో చర్యలు తీసుకున్నప్పటికీ అదేచోట మళ్లీ నిర్మించారని తెలిపారు. అమీన్‌పూర్‌లో ఆసుపత్రిని కూల్చేశారని చెబుతున్నారని, కానీ ఆ ఆసుపత్రిలో రోగులు ఎవరూ లేరని వెల్లడించారు. ఇందుకు సంబంధించి వీడియో రికార్డ్ చేశామన్నారు. ప్రజలు నివసిస్తున్న భవనాలను కూల్చలేదన్నారు. ఇటీవల కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలను కూల్చివేశామని తెలిపారు. ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ కొంతమంది ఖాళీ చేయలేదని తెలిపారు. హైడ్రా విషయమై భయంతో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నదని, ఇది తెలిసి తాను చాలా బాధపడ్డానని రంగనాథ్ అన్నారు. బుచ్చమ్మను కొంతమంది భయపెట్టారన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు చెరువులు ఆక్రమించరని తెలిపారు. అక్రమ కట్టడాల వెనుక పెద్దవాళ్లు ఉన్నారని రంగనాథ్ చెప్పారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ సందర్భముగా స్పష్టం చేశారు. పేదలకు ఇబ్బంది చేయాలనేది హైడ్రా అభిమతం కాదన్నారు. హైడ్రాను బూచిగా చూపించి ప్రజలను భయపెడితే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందన్నారు. హైడ్రా అంటే భరోసా, బాధ్యత అని గుర్తించాలన్నారు. హైడ్రాను బూచిగా చూడవద్దని, చూపించవద్దని కోరారు. ఎవరికైనా సమయం ఇచ్చిన తర్వాతనే కూల్చివేతలు ప్రారంభిస్తున్నామన్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ చెరువులను, నాలాలను కాపాడుకోలేమన్నారు. ఆస్తుల రక్షణకే ముఖ్యమంత్రి హైడ్రాను తీసుకువచ్చారన్నారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ హైడ్రా బాధ్యత అన్నారు. హైడ్రాను ఏర్పాటు చేసి రెండు నెలలు అయిందన్నారు. ప్రభుత్వ, ప్రజల ఆస్తులను పరిరక్షించే బాధ్యత తమపై ఉందని వెల్లడించారు. పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడం మన హక్కు అని, ప్రజల ఆస్తులను రక్షించాలని రాజ్యాంగంలోనే ఉందని వెల్లడించారు. పేదలను ఇబ్బంది పెట్టాలనేది హైడ్రా అభిమతం కాదన్నారు. ఓవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోతుందనే చర్యలు తీసుకోలేదని, విద్యాసంవత్సరం ముగిశాక కాలేజీలపై చర్యలు తప్పవని తెలిపారు. కానీ అక్రమ కట్టడాల వెనుక పెద్దవాళ్లు ఉన్నారని రంగనాథ్ అన్నారు.

## 13 రోజుల్లో 4 వేల కుక్కలకు వ్యాక్సినేషన్




**విశ్వంభర, హైదరాబాద్:** ఈ నెల 15 నుండి 13 రోజుల పాటు మిషన్ రేబిస్, డబ్ల్యూ వి ఎస్, ఏ టి సి, బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మున్సిపల్ కమిషనర్ల సహకారంతో యాంటీ రేబిస్ వాక్సినేషన్ డ్రైవ్ చేపట్టి 4 వేల కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేయడం జరిగిందని బ్లూ క్రాస్ ప్రతినిధి, సినీ నటి అమల అక్కినేని తెలిపారు. వరల్డ్ రేబీస్ ప్రివెన్షన్ డే సందర్భంగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మిషన్ రేబిస్, డబ్ల్యూ వీఎస్, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఖైరతాబాద్ జోన్ కె బి ఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేబీస్ వ్యాధి నివారణకు కుక్కలకు యాంటీ రేబీస్ టీకా వేయడం, కుక్కల జనన నియంత్రణ చేయడం ఒక్కటే పరిష్కారం అన్నారు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ వివిధ వ్యాధులకు మనుషులు టీకా తీసుకోవడం ఎంత ముఖ్యమో జంతువులకు కూడా అంతే ముఖ్యమన్నారు. కుక్కలన్నింటికి తప్పనిసరిగా యాంటీ రేబీస్ టీకా వేయించాలన్నారు. అప్పుడే మనం సురక్షితంగా ఉంటామన్నారు. జీహెచ్ఎంసీ తో పాటుగా అన్ని మున్సిపాలిటీలలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్లు ఉన్నాయని, అన్ని జిల్లాలలో ఈ సెంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. 142 మున్సిపాలిటీలలో సుమారు 2.5 లక్షల కుక్కలు ఉండగా, ఇప్పటివరకు 92 వేల కుక్కలకు కుటుంబ నియంత్రణ కోసం స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయడం జరిగిందని తెలిపారు. మిగతా కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. వీధి కుక్కల జనన నియంత్రణకు, రేబీస్ నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

# లోక్ అదాలత్‌లను ఉపయోగించుకోవాలి




**విశ్వంభర, రామన్నపేట:** సమస్యల పరిష్కారానికి లోక్ అదాలత్ లను ఉపయోగించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఏ.ప్రదీప్, అడిషనల్ జూనియర్ జడ్జ్ ఎస్.చందనాలు పిలుపునిచ్చారు. రామన్నపేట మండల కేంద్రంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్న, చిన్న సమస్యలకు కోర్టును ఆశ్రయించడం జరుగుతుందని, కోర్టును ఆశ్రయించిన తర్వాత రాజీ అవ్వాలనుకుని పార్టీలు భావించినట్లయితే, వెంటనే లోక్ అదాలత్ లకు వచ్చి కేసులు పరిష్కారం చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని, ఈ లోక్ అదాలత్ లను ఉపయోగిం చుకొని, క్లైంట్లు తమ సమస్యలు పరిష్కరించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమని, రాజీ చేసుకుంటే ఇద్దరు గెలుస్తారు, సమస్యలను కూర్చొని సెటిల్మెంట్ చేసుకోవడానికి లోక్ అదాలత్ మంచి పరిష్కార మార్గమని వారు అన్నారు. పెరుగుతున్న భూముల ధరలు, చిన్నచిన్న పంచాయతీలు కూర్చొని మాట్లాడుకునే అటువంటి సమస్యలు కాబట్టి క్లైంట్లు అందరూ సమస్యలు పరిష్కరించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్య క్షులు ఎండి.మజీద్, లింగయ్య, సత్తయ్య, మామిడి వెంకటరెడ్డి, శ్రవణ్ కుమార్ రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, జినుకల ప్రభాకర్, బర్ల డేవిడ్, పీపీ ఖాజా అలీ, యాదసు యాదయ్య, దినేష్ స్వామి, రమేష్, అజీజ్, రెండు కోర్టుల సూపరింటెండెంట్లు, నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, క్లైంట్లు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ భర్తకు నివాళులర్పించిన నాయకులు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల మాజీ ఎంపీపీ కమ్లి భర్త మోత్యా నాయక్ గత కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతూ శనివారం మరణించారు. మైసిగండిలో ఆయన నివాసంలో మృతదేహానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ జడ్పీటీసీలు దశరథ్ నాయక్, అనురాధ పత్య నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, పీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు భిచయ నాయక్, జగన్, నివాళలర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గౌడ సంఘం అధ్యక్షులుగా కందాల వెంకట్రాజం గౌడ్



**విశ్వంభర, అర్వపల్లి :** గౌడ సంఘం అధ్యక్షులుగా కందాల వెంకట్రాజం గౌడ్ 4వ సారి అత్యధిక మెజారిటీతో ఎన్నికయ్యారు.ఆయన మీడియాతో మాట్లాడుతూ నాపై నమ్మకంతో అర్వపల్లి గ్రామ గౌడ కులస్తులు నాకు ఓటు వేసి నాలుగోసారి గెలిపించినందుకు గ్రామ గౌడ కులస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అర్వపల్లి గౌడ కులస్తుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. అర్వపల్లి గ్రామ గౌడ కులస్తులు జునూరు నాదం, అంబాల ధనుంజయ, బైరగొని రామకృష్ణ, మేడిపల్లి రాజు, కొల సురేష్, జక్కు రాము, లక్ష్మణ్, ఇంద్రసేన, మేడిపల్లి మొగిలి, కందాల శ్రీనివాస్, కందాల వెంకటేష్, ఆకుల క్రాంతి కుమార్, మేడిపల్లి రమేష్, ఆకుల బాబు, కోయాడ శ్రీనివాస్, కరుణాకర్,తదితరులు పాల్గొన్నారు. అర్వపల్లి గ్రామంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చి, విజయోత్సవ సంబురాలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

# నేడే ఉచిత మెగా వైద్య శిబిరం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నేడు(ఆదివారం రోజు)ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడుతుంది.మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోగలరు. భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవా మహా యజ్ఞం కార్యక్రమంలో భాగంగానే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తుమ్మల మురళీధర్ రెడ్డి సహకారంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోగలరని ఆత్మకూరు(ఎం) మండల ప్రజానీకానికి మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో మండల ప్రజలకు తెలియజేసారు.



రాహుల్ గాంధీతో పాటు విదేశాల్లో పర్యటించి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాస్కి గౌడ్‌కి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులూ దాము మహేందర్ యాదవ్ , శ్రవణ్ గుప్త , విజయ్ కుమార్, సతీష్ గౌడ్: విశ్వంభర, హైదరాబాద్



విదేశీ పర్యటన విజయవంతంగా పూర్తిచేసుకొని వచ్చిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కికి ఎయిర్ పోర్ట్ లో స్వాగతం పలికిన వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్, మకటం సదాశివుడు, లింగాల కిషోర్ గౌడ్, కదిరి బాయ్ వేణు యాదవ్: విశ్వంభర, హైదరాబాద్

# ఒక కోటి 71 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## బోడుప్పల్‌ను నెంబర్ వన్‌గా చేస్తాం: మేయర్ అజయ్ యాదవ్



విశ్వంభర, మేడిపల్లి :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తానని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని ఒకటి, మూడు, నాలుగు, 23 డివిజన్ పరిధిలోని ద్వారకా నగర్, మల్లయ్య నగర్, క్రాంతి కాలనీ, హరితహారం కాలనీ, కృష్ణానగర్, వివేక్ నగర్ కాలనీ, శ్రీ లక్ష్మీ నగర్ ,లెక్చరర్స్ కాలనీ ప్రాంతాల్లో సుమారు కోటి 71 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రతి డివిజన్లో ప్రజలకు మౌలిక సదుపాయాలను ప్రతిపాదికన కల్పిస్తామని వెల్లడించారు. అదేవిధంగా దీర్ఘకాలంగా అపరిష్కరణంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, కాలనీలను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని వివరించారు. రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కార్పొరేటర్ లందరి సహాయ సహకారాలతో బోడుప్పల్ కార్పొరేషన్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు పోగుల నరసింహారెడ్డి,కొత్త చందర్ గౌడ్, జంగయ్య యాదవ్, రసాల వెంకటేష్ యాదవ్, సింగిరెడ్డి పద్మా రెడ్డి, డి ఈ. చిరంజీవితో పాటు వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మారేడ్పల్లి సాయి జ్యోతి సూపర్ స్పెషాలిటీ హై హాస్పిటల్ వారు చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్క్ నంబర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారేపల్లి రవి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు బై ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏ సాయిబాబా గౌడ్, డాక్టర్ హెచ్ సప్పు, డాక్టర్ డి చంద్రకాంత్, స్థానిక కార్పొరేటర్ సామల, హేమ, బీఆర్ఎస్ సీనియర్ లీడర్ సరోజ, మహిళా కార్యకర్త శ్యామల పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.: విశ్వంభర, సికింద్రాబాద్

# తిరుమల లడ్డూ వ్యవహారంపై కొనసాగుతున్న మాటల యుద్ధం

**విశ్వంభర, అమరావతి:**

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై అధికార,ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం కొనసాగుతోనే ఉంది. శనివారం మంగళగిరి హోంమంత్రి మాట్లాడుతూ ఎప్పుడూనా లడ్డూ తిన్నారా జగన్ అంటటూ ధ్వజమెత్తారు. డిప్యూటీ సీఎం అయ్యింది దీక్షలు చేయడానికా?.. పవన్ కల్యాణ్‌పై సీపీఐ రామకృష్ణ మండిపడ్డారు. తిరుమల లడ్డూ వివాదంపై ఇప్పటికైనా సైలెంట్‌గా ఉండు.. జగన్‌కు చింతా మోహన్ హితవు పలికారు. వెంకన్నపై విశ్వాసం లేకనే జగన్ తిరుమలకు వెళ్లలేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.చంద్రబాబుకు ఈ వయసులో రాజకీయాలు ఎందుకు.. అంటూ మాజీ మంత్రి పేర్ని నాని కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ మళ్లీ తిరుమల వెళ్తారు.. ఎవరు ఆపుతారో చూస్తాం.. గుడివాడ అమర్ నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ డిక్లరేషన్ అడగలేదని భూమన అన్నారు. కొత్తగా డిక్లరేషన్ ఎందుకు అంటూ మల్లాది విష్ణు వ్యాఖ్యానించారు.

## ఎప్పుడైనా తిరుమల లడ్డూ తిన్నారా.. జగన్‌పై ధ్వజమెత్తిన వంగలపూడి అనిత..



**మంగళగిరి:** మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమలకు రాకుండా ఆపే ప్రయత్నం చేయలేదని ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తిరుమలకు రావద్దని జగన్‌కు నోటీసులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో వంగలపూడి అనిత మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ..జగన్ ఇటీవలచాలా జిల్లాల్లో పర్యటించారని.. ఎక్కడా ఆయన్ను అడ్డుకోలేదని గుర్తుచేశారు. జగన్‌కు తిరుమల వెళ్లే ఇష్టం లేకే పర్యటన రద్దు చేసుకున్నారని ఆరోపించారు. టాపిక్ డైవర్ట్ చేయడానికి నోటీసుల గురించి మాట్లాడారనిఅన్నారు.జగన్‌నుఆపేప్రయత్నంతామేం చేయలేదని అన్నారు. జగన్ ఎప్పుడైనా తిరుమల లడ్డూ తిన్నారా అని వంగలపూడి అనిత ప్రశ్నించారు. అక్షింతలు వేసిన వెంటనే దులుపుకున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. ప్రసాదాన్ని టిష్యూ పేపర్‌లో పెట్టి పక్కన పడేసే వ్యక్తులు వాళ్లు అని అన్నారు.తప్పు చేసి క్షమాపణ కూడా కోరడం లేదని వైఎస్ జగన్‌పై వంగలపూడి అనిత మండపడ్డారు. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ వ్యవహారాన్ని విచారించేందుకు సిట్ ఏర్పాటు చేయడాన్ని జగన్ తప్పుబట్టడంపైనా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ పోలీసులతో కాకపోతే సాక్షి ఉద్యోగులతో వేయాలా అని ప్రశ్నించారు. గతంలో మీ దగ్గర పనిచేసిన పోలీసులే సిట్‌లో ఉన్నారని చెప్పారు. తప్పు చేయకపోతే విజిలెన్స్ రిపోర్టుపై కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తిరుమల విషయంలో గ్యాగ్ ఆర్డర్ కోసం ఎందుకు కేసు వేశారని నిలదీశారు.డిక్లరేషన్ ఇచ్చి గుడిలోకి వెళ్లడానికి ఇబ్బంది ఏంటి అని జగన్‌ను వంగలపూడి అనిత ప్రశ్నించారు. హైందవ సాంప్రదాయలను ఎందుకు గౌరవించడం లేదని ప్రశ్నించారు. మసీదులు, చర్చిలు, ఆలయాలకు ప్రత్యేక ఆచారాలు ఉంటాయని.. ఆయా ప్రార్థనా మందిరాలకు వెళ్లినప్పుడు ఆ ఆచారాలను గౌరవించాలని ఆమె వివరించారు. జగన్ ఏర్పాటు చేసిన పాలక మండలిలో ఒక్క దళితుడికి కూడా అవకాశం ఇవ్వలేదని అనిత గుర్తుచేశారు. అలాంటి జగన్ ఆలయంలో దళితుల ప్రవేశంపై మాట్లాడుతున్నారని విమర్శించారు. నేను హిందువును.. నువ్వు నీ మతమేంటో ధైర్యంగా చెప్పగలవా అని జగన్‌ను వంగలపూడి అనిత ప్రశ్నించారు

## జగన్ మళ్లీ తిరుమల వెళ్తారు.. ఎవరు ఆపుతారో చూస్తాం: గుడివాడ అమర్‌నాథ్

రాజకీయాల కోసం తిరుమల వెంకన్నను చంద్రబాబు వివాదంలోకి లాగుతున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జగన్‌తో ఏదైనా ఉంటే నేరుగా తలపడాలని అన్నారు. నెయ్యి కల్తీ వివాదంపై మేమే సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. చంద్రబాబు చేసిన ఆరోపణలు నిజమని నిరూపించాలని సవాలు విసిరారు. తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బ తీసేలా ఏపీ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలను విమర్శిస్తూ వైసీపీ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు విశాఖలో గుడివాడ అమర్‌నాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గుడివాడ అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. 100 రోజుల పాలనలో తమ పొరపాట్లను కప్పిపుచ్చుకునేందుకే మాట్లాడుతున్నారని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసం తిరుమలను వాడుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు చేసిన తప్పులతో జనసేన దీక్షలు చేస్తోందని విమర్శించారు. సూపర్ 6 హామీలు అమలు చేయనుందుకు పవన్‌కల్యాణ్ దీక్ష చేయాలని సూచించారు. ఎవరు తప్పు చేస్తారో వారే ప్రాయశ్చిత దీక్ష చేస్తారని వ్యాఖ్యానించారు.నమ్మకంతో తిరుమలకు వెళ్లేవారికి డిక్లరేషన్ ఎందుకు అని గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. డిక్లరేషన్ ఇచ్చి తిరుమలకు వెళ్లడం అనేది జరగని పని అని అన్నారు. సమయం చూసుకుని జగన్ మళ్లీ తిరుమలకు వెళ్తారని తెలిపారు. జగన్‌ను ఎవరు ఆపుతారో చూస్తామని స్పష్టం చేశారు.

## ఎప్పుడూ డిక్లరేషన్ అడగలేదు: భూమన

తిరుమల పవిత్రతను చంద్రబాబు దెబ్బతీశారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. స్వామి వారి ప్రసాదంపై అపవాదు వేశారని మండిపడ్డారు. సీఎం హోదాలో తప్పుడు వ్యాఖ్యలు చేశారని అన్నారు. తమ హయాంలో ఎలాంటి తప్పు జరగలేదని స్పష్టం చేశారు. ధైర్యంగా సీబీఐ విచారణకు మేం డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రిని తిరుమల రాకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు 700 మంది అన్యమతస్తులు తిరుమలకు వస్తారని చెప్పారు. తాము ఏనాడూ డిక్లరేషన్ తీసుకోలేదని స్పష్టం చేశారు.

## కొత్తగా డిక్లరేషన్ ఎందుకు మల్లాది విష్ణు

వైసీపీపై కావాలనే బురద జల్లుతున్నారని మల్లాది విష్ణు అన్నారు. శ్రీవారి లడ్డూను రాజకీయాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదనే జగన్ తన తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నారని స్పష్టం చేశారు. లడ్డూ వివాదంలో ప్రజలు అన్ని గమనించారని అన్నారు. అందుకే డిక్లరేషన్ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. ఎన్నోసార్లు తిరుమల వెళ్లిన జగన్ ఇప్పుడు కొత్తగా డిక్లరేషన్ ఇవ్వడమేంటని నిలదీశారు.

## డిప్యూటీ సీఎం అయ్యింది దీక్షలు చేయడానికా?.. పవన్ కల్యాణ్‌పై సీపీఐ రామకృష్ణ ఫైర్...



తిరుమల లడ్డూ వివాదంపై ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పెట్టాలనిసీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూచించారు. తప్పు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. భక్తుల మనోభావాలు కాపాడాలని కోరారు. రాజకీయ విమర్శలు మానుకొని.. రాష్ట్రంలో ఉన్న సమస్యలపై ఫోకస్ పెట్టాలని విజ్ఞప్తి చేశారు.తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంపై ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు సిట్ దర్యాప్తునకు ఆదేశించారని రామకృష్ణ అన్నారు. ఈ వివాదంపై అవసరమైతే ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి మాట్లాడతారని అన్నారు. ఈ వివాదంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సంబంధమేంటి అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం అయ్యింది దీక్షలు చేయడానికా అని ఆయన్ను ప్రశ్నించారు. భార్య క్రిస్టియన్ అని చెప్పిన పవన్ కల్యాణ్ తిరుమలకు వెళ్లొచ్చా అని నిలదీశారు. దేవుడిని అడ్డం పెట్టుకుని మరొకరిపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు.అందరివాడైన వేంకటేశ్వరస్వామికి మత రాజకీయాలు ఆపాదించడం తగదని రామకృష్ణ అన్నారు. తిరుమలకు జగన్ వెళ్తే అపవిత్రం అనే వ్యాఖ్యలు తగదని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భార్య క్రిస్టియన్ కాదా అని ప్రశ్నించారు. మరి ఆయన తిరుమలకు ఎలా వెళ్తున్నాడని నిలదీశారు. వైఎస్‌ఆర్ ఐదేళ్ల పాటు సీఎంగా ఉండి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారని అన్నారు. పట్టువస్త్రాలు ఇవ్వడమనేది ఒక ప్రాధాన్యత గల అంశమని.. అప్పుడు మాట్లాడకుండా.. నేడు సాధారణ భక్తుడిలా జగన్ తిరుమలకు వెళ్తానంటే డిక్లరేషన్ అడగడమేంటని నిలదీశారు.

## తిరుమల లడ్డూ వివాదంపై ఇప్పటికైనా సైలెంట్‌గా ఉండు:చింతా మోహన్

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అన్య మతస్తుడే అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. డిక్లరేషన్‌పై జగన్ సంతకం ఎందుకు పెట్టరని ప్రశ్నించారు.ఎడమ చేతితో సంతకం చేయి.. ఎంతో మంది సంతకాలు పెట్టి పోయారని వ్యాఖ్యానించారు.మానవత్వం గురించి జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సొంత ఎంపీ రఘురామకృష్ణ రాజును కొట్టించడమేనా మానవత్వం, ఇదేనా ప్రేమ అని చింతా మోహన్ ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిన మాట వాస్తవమే అని తెలిపారు. అయినప్పటికీ ఇంకా భక్తులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని జగన్‌పై మండపడ్డారు. లడ్డూ వ్యవహారంతో జగన్ రాజకీయ పతనం ప్రారంభమైందని విమర్శించారు. ఇప్పటికైనా తిరుమల లడ్డూ వ్యవహారంలో సైలెంట్‌గా ఉండమని హితవు పలికారు. దళితులపై ప్రేమ కురిపిస్తూ జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని చింతా మోహన్‌విమర్శలు గుప్పించారు. దళితులపై అంత ప్రేమ ఉంటే ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఎందుకు మూసివేశావని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లను ఎందుకు ఆపేశావని నిలదీశారు.

## చంద్రబాబుకు ఈ వయసులో రాజకీయాలు ఎందుకు: మాజీ మంత్రి పేర్ని నాని



తిరుమల డిక్లరేషన్ వివాదంపై మాజీ మంత్రి పేర్ని నాని కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ ఇప్పుడు కొత్తగా డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం ఏంటని ఆయన ప్రశ్నించారు. శ్రీవారిపై నమ్మకంతోనే జగన్ అనేకసార్లు దర్శనం చేసుకున్నారని తెలిపారు. తిరుమలకు వచ్చే వారందరి నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు.మోదీతో అన్యమతస్తుడు తిరుమలకు వెళ్తే బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. చంద్రబాబు ఏటా క్రిస్మస్ రోజు చర్చికి వెళ్తున్నారని అన్నారు. మసీదుకు వెళ్లి ప్రార్థన చేసే చంద్రబాబు నిఖార్సయిన హిందువా అని నిలదీశారు.జగన్ మతమేంటో తెలుగు ప్రజలందరికీ తెలుసని అన్నారు. చంద్రబాబుకు ఈ వయసులో రాజకీయాలు ఎందుకు అని పేర్ని నాని ప్రశ్నించారు. జగన్‌ను రాజకీయంగా అంతమొందించాలని కుట్ర పన్నారని విమర్శించారు. తెలిసి తెలిసి చంద్రబాబు, పవన్ కల్యాణ్ తప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, అధికారులు తలో మాట చెబుతున్నారని అన్నారు. ఏ తప్పు జరగకపోయినా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు.

## జగన్ తిరుమలకు అందుకే వెళ్లలేదు: మంత్రి కొల్లు రవీంద్ర

వెంకన్నపై విశ్వాసం లేకనే జగన్ తిరుమలకు వెళ్లలేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పర్యటన రద్దు చేసుకుని విమర్శలు చేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. జగన్ తీరుతో హిందూ సంఘాలు ఆందోళనలో ఉన్నాయని అన్నారు. డిక్లరేషన్‌పై సంతకం పెట్టడానికి జగన్‌కు ఇబ్బందేంటి అని ప్రశ్నించారు. గతంలో అబ్దుల్ కలాం, సోనియా గాంధీ కూడా డిక్లరేషన్‌పై సంతకం పెట్టారని గుర్తుచేశారు. తాము ఏ ఒక్కరికీ నోటీసులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.హింసా రాజకీ యాలపై మాట్లాడే హక్కు పేర్ని నానికి లేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గతంలో టీడీపీ, జనసేననాయకుల ఇళ్లపై దాడికి దిగారని అన్నారు. తనపై హత్యాచారం కేసు మోపి 54 రోజులు జైల్లో పెట్టారని గుర్తుచేశారు. బందరు పోర్టు, మెడికల్ కాలేజీలను ఎవరికి బేరం పెట్టారని పేర్ని నానిని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల పేరుతో పేదల భూములు కబ్జా చేశారని ఆరో పించారు. పేర్ని నాని అవినీతిపై విచారణ జరుగు తోందని తెలి పారు. త్వరలోనే అన్ని వివరాలను బయట పెడతామని స్పష్టం చేశారు.

# గనుల దోపిడీలో పెద్ద డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా పట్టుకోవాలి : వైఎస్ షర్మిల



**విశ్వంభర, అమరావతి :** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గత ప్రభుత్వ వైసీపీ నాయకుల ఆగడాలపై ట్విటర్ వేదిక ద్వారా విరుచుకు పడుతూనే ఉన్నారు. పరోక్షంగా తన అన్న వైఎస్ జగన్‌పై మాటల దాడిని కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా శనివారం ట్విటర్ ద్వారా స్పందించిన ఆమె వైసీపీ హయాంలో జరిగిన గనుల దోపిడీపై విమర్శల అస్త్రాలను గుప్పించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గనుల దోపిడీపై వెంకట్ రెడ్డి లాంటి తీగలే కాదు. పెద్ద డొంకలు కూడా కదలాలి. ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్ లో ఉన్నా, విచారణ జరిపి పట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.2,566 కోట్ల దోపిడీకి పాల్పడ్డ ఘనుడు వెంకట్ రెడ్డి అయితే, తెరవెనుక ఉండి, సర్వం తానై, వేల కోట్లు కాజేసిన ఆ ఘనపాటి ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని విమర్శించారు.5 ఏళ్లుగా రాష్ట్రంలో అడ్డగోలుగా సహజ సంపదను దోచుకుతిన్నారని, అస్మదీయ కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులు ఇచ్చి టెండర్లు, ఒప్పందాలు, ఏపీఎంఎంసీ నిబంధనలను బేఖాతరు చేసి అనుకున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టారని ఆరోపించారు. ఎన్జీటీ నిబంధనలను తుంగలో తొక్కారని, రాష్ట్ర ఖజానాకు రావాల్సిన నిధులు సొంత ఖజానాకు తరలించారని మండిపడ్డారు.గత ప్రభుత్వ హయంలో జరిగిన మైనింగ్ కుంభకోణంపై ఏసీబీ విచారణతో పాటు పూర్తి స్థాయిలో సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చిన్న చేపలను ఆడించి సొమ్ము చేసుకున్న పెద్ద తిమింగలాన్ని పట్టుకొనేలా దర్యాప్తు జరగాలని కూటమి సర్కార్‌ను డిమాండ్ చేశారు.

# భారతీయుడివి కాదనుకుంటే పాకిస్తాన్‌కో.. దుబాయికో వెళ్లు: టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి



**విశ్వంభర, అమరావతి** : ఆలయంలో ప్రవేశించే వ్యక్తి తన మతమేంటో చెప్పాలా? ఇదేం దేశం.. ఇదేం హిందూయిజం అని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. కొవ్వెక్కి ఇదేం దేశం అంటావా?.. భారతీయుడివి కాదని అనుకుంటే పాకిస్తాన్‌కో.. దుబాయికో పోవాలని సూచించారు. భారత పౌరుడవు అయ్యి ఉండి దేశాన్ని, హిందూ మతాన్ని కించపరచడానికి సిగ్గుండాలని మండిపడ్డారు.జగన్ ఐదేళ్లు రాష్ట్రాన్ని వల్లకాడులా మార్చేశాడని ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శించారు. ఇప్పుడు దేశాన్ని, మతాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం పెట్టేందుకు జగన్ ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. డిక్లరేషన్‌పై సంతకం పెడితే భారతమ్మ ఇంట్లోకి రానివ్వదనా? లేదా క్రైస్తవ ఓట్లు పోతాయని పర్యటన రద్దు చేసుకున్నావా? అని నిలదీశారు. ఇప్పటికైనా దేశానికి, హిందువులకు జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అసలు రాష్ట్రంలో జగన్ పరిస్థితి, వైసీపీ పరిస్థితి ఏంటి అని సోమిరెడ్డి ప్రశ్నించారు. ఈ రోజుకీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు వెళ్లలేకపోతున్నారని.. మిథున్ రెడ్డి రాజంపేట వెళ్లట్లేదని చెప్పారు. కొడాలి నాని, వంశీ, రోజాలు నియోజకవర్గాలకే కాదు కదా కనీసం వారి జిల్లాలకు కూడా వెళ్లలేకపోతున్నారని తెలిపారు. సజ్జల రామకృష్ణా రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలది అజ్ఞతవాసమైతే.. విజయిసాయిరెడ్డి వైజాగ్‌కు వెళ్లలేకపోతున్నారని అన్నారు. ఇక జగన్ తాను పుట్టిన రాయలసీమలోని తిరుపతికి వెళ్లలేకపోతున్నారని విమర్శించారు.

# అక్టోబర్ 1న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**విశ్వంభర, తిరుమల :** తిరుమల లో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్టోబర్ 1 నిర్వహించనున్న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం దృష్ట్యా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 30న సిఫార్సు లేఖలను అనుమతించడం లేదని తెలిపారు. అక్టోబరు 4 నుంచి 12 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. వేడుకల దృష్ట్యా అష్టదళ పాద పద్మారాధన సేవ రద్దు చేశామన్నారు.సంవత్సరానికి నాలుగు సార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంట ఏకాదశి , వార్షిక బ్రహ్మోత్సవాలకు వచ్చే ముందు మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్‌ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఆచారాన్ని దృష్టిలో ఉంచుకుని, అక్టోబర్ 1న ప్రోటోకాల్ వీఐపీలు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాన్ని టీటీడీ రద్దు చేసిందన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి నిర్వాహకులకు సహకరించాలని కోరారు.

# విశాఖ స్టీల్ పరిరక్షణకు సెయిల్‌తో చర్చలు నిజమే

■ కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**దిల్లీ :** విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. ప్లాంట్‌ను, ఉద్యోగులు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంస్థను ముందుకు తీసుకెళ్లడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.దిల్లీలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల వైఫల్యాలు, వారి సొంత ప్రయోజనాలు, నాయకుల మెప్పు కోసం స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. వారి వల్లే విశాఖ ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లిందని ఆరోపించారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో నష్టాల్లో నడుస్తున్న సంస్థలను పదేపదే నడపటం కేంద్ర ప్రభుత్వానికి సాధ్యం కాదని అన్నారు.విశాఖ స్టీల్‌ను శాశ్వతంగా నడిపేందుకు కేంద్రం సహాయం చేస్తూనే ఏ విధంగా లాభాల బాటల్లోకి తీసుకువచ్చేందుకు అన్ని కోణాల్లో ఆలోచించుతున్నామన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, ఆర్థిక మంత్రి నిర్మలసీతరామన్‌కు ప్లాంట్‌పై పూర్తిగా అవగాహన ఉందన్నారు. విశాఖ స్టీల్‌ను లాభాల బాటలో పట్టించేందుకు సెయిల్ అనే సంస్థతో సమావేశం జరిగిన మాట వాస్తవమని పేర్కొన్నారు.అయితే సెయిల్‌లో విలీనం వల్ల వచ్చే సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. విశాఖలో ఉద్యోగులు ఎక్కువ, ప్రొడక్షన్ తక్కువ కారణంగా నష్టాల్లో నడుస్తుందని అన్నారు. సమర్థవంతమైన అధికారులను నియమించి లాభాల బాట పట్టించడానికి తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నానని శ్రీనివాస వర్మ వెల్లడించారు.

# కేతిరెడ్డి కేటురెడ్డిగా మారిపోయాడు

■ మంత్రి సత్యకుమార్ ఎద్దేవా



విశ్వంభర, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. కేతిరెడ్డి కేటురెడ్డిగా మారిపోయారని ఆయన ఎద్దేవా చేశారు. ధర్మవరాన్ని కేతిరెడ్డి దౌర్జన్యాలకు కేంద్రంగా మార్చారని విమర్శించారు. కేతిరెడ్డి గుర్రాల కోటను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. కేతిరెడ్డి దౌర్జన్యాలు చేస్తామంటే తాట తీస్తామని హెచ్చరించారు.తిరుమల లడ్డూ వివాదంపై కూడా మంత్రి సత్యకుమార్ స్పందించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడే లడ్డూ కల్తీ జరిగిందని తెలిపారు. ఈ పాపం జగన్‌దే అని.. ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ మొదటి నుంచి తిరుమల ప్రతిష్ఠ దెబ్బతీశారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన బంధువులైన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్లుగా నియమించారని.. తనకు అనుకూలమైన ధర్మారెడ్డిని ఈవోగా నియమించారని చెప్పారు.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యి విషయంలోనూ జగన్ అబద్ధాలు చెబుతున్నారని మంత్రి సత్యకుమార్ విమర్శించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఆందోళనకు గురయ్యారని అన్నారు. తప్పు చేసిన తానే సంప్రోక్షణ చేస్తానని అంటున్నారని అన్నారు. నాలుగు గోడల మధ్య బైబిల్ చదువుతానని, బయట ఇతర మతాలను గౌరవిస్తానని చెప్పిన జగన్.. డిక్లరేషన్‌లో సంతకం చేసే ధైర్యం లేకనే తిరుమలకు వెళ్లలేదని విమర్శించారు.

# జగన్‌ను దేశం నుంచి బహిష్కరించాలి ఏపీ మంత్రి గొట్టిపాటి

**విశ్వంభర, అమరావతి :** దేశ సంప్రదాయాలు పాటించకపోగా వాటిని కించపరుస్తూ బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నజగన్ ను వెంటనే దేశ బహిష్కరణ చేయాలని ఏపీ మంత్రి గొట్టిపాటి రవి అన్నారు. ఎలాంటి దేశంలో బతుకుతున్నామో అంటూ చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలని మంత్రి శనివారం ట్విట్టర్‌లో డిమాండ్ చేశారు.ఏ మతానికైనా కొన్ని సిద్ధాంతాలుంటాయని, వాటిని గౌరవిస్తేనే మంచి దేశ పౌరుడవవుతావని హితవు పలికారు. . భారతదేశ ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశాలతో అత్యున్నత పదవులు పొంది, వాటిని అడ్డం పెట్టుకుని దేశ సంపదను కొల్లగొట్టావని ఆరోపించారు.దేశంలో ఉంటూ దేశ సంప్రదాయాలను కించ పరుస్తున్నారని విమర్శించారు. పవిత్రమైన తిరుమలలో అన్యమతస్థులు డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధన పాటించాల్సిందేనని తేల్చిచెప్పేసరికి, ఏకంగా దేశాన్ని, మత సామరస్యాలను కించ పరుస్తున్నాడని ఆరోపించారు. భారతదేశమన్నా, దేశ సంప్రదాయాలన్నా ఏమాత్రం గౌరవం లేదనే తన నైజాన్ని జగన్ బయటపెట్టుకున్నాడని పేర్కొన్నారు.

# ముంబయి నగరానికి ఉగ్రముప్పు హెచ్చరికలు

## ■ పోలీసులు హై అలర్ట్



**ముంబయి:** దేశ ఆర్థిక రాజధాని ముంబైలో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై మహానగరానికి ఉగ్ర ముప్పు పొంచి ఉన్నట్టు కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో అప్రమత్తమైన నగర పోలీసులు ముంబై వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రాంతాలతోపాటు మతపరమైన ప్రాంతాల్లో సైతం పోలీసులు భారీగా మోహరించారు. ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ సైతం నిర్వహించాలని ఆదేశించినట్లు నగర పోలీస్ ఉన్నతాధికారి ఒకరు శనివారం వెల్లడించారు. నగరంలోని డీసీపీలు (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్) కూడా తమ తమ జోన్లలో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే ముందు జాగ్రత్త చర్యగా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు.వివిధ ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి.ముంబయి లోని రెండు ప్రసిద్ధ మతపరమైన ప్రదేశాలు ఉన్న క్రాఫోర్డ్ మార్కెట్ ప్రాంతంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ముంబయిలో ప్రతిఏటా దుర్గాపూజ, దీపావళి పండగలను ఘనంగా నిర్వహిస్తారు. పండుగల సీజన్ నేపథ్యంలో నగరం లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ నెల 10 రోజులపాటు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకున్న ముంబై వాసులు ఇప్పుడు దుర్గాపూజ, దసరా, దీపావళి పండగ లు సిద్ధమవుతున్నట్లు గుర్తు చేశారు. ఈ సమయంలో ఉగ్రముప్పు హెచ్చరికలు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. అంతేకాకుండానవంబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగే అవకాశ ఉన్నందున నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా భద్రతను కట్టుదిట్టంచేసినట్లు పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు.ఈ క్రమంలో ఉగ్ర ముప్పు హెచ్చరికలు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.

# టాటా మొబైల్ తయారీ కేంద్రంలో పేలుడు

## ■ భారీగా ఎగిసిపడిన మంటలు



**కోయంబత్తూరు:** తమిళనాడులోని టాటా ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఫ్యాక్టరీలోని రసాయన గోదాములో పేలుడు సంభవించడంతో ఈ ఘటన జరిగింది. పెద్దఎత్తున మంటలు ఎగసిపడ్డాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణగిరి జిల్లా ఉద్దానపల్లిలోని టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఈపీఎల్)లో గల మొబైల్ ఫోన్ యాక్సెసరీస్ పెయింటింగ్ యూనిట్లో ని రసాయన గోదాములో శనివారం ఉదయం 5.30 గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం గోదాములో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ సురక్షితంగా బయటకు తరలించారు. ప్రమాదం ధాటికి భారీగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని ఏడు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు అదుపులోకి తెచ్చారు.ఈ కంపెనీలో టీఈపీఎల్ సంస్థ ఐఫోన్లలో వాడే వివిధ ఉపకరణాలను ఉత్పత్తి చేస్తోంది. సుమారు 4,500 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో రాత్రిపూట విధుల్లో ఉన్న ఉద్యోగులు మాత్రమే ఉన్నారు.ప్రమాద సమయంలో ఫస్ట్ షిఫ్ట్‌లో 1,500 మంది ఉద్యోగులు డ్యూటీలో ఉన్నారు. వారు వెంటనే అప్రమత్తమవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు పేర్కొన్నారు.పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో కొందరు ఉద్యోగులు శ్వాస సంబంధిత ఇబ్బందులను ఎదుర్కొన్నారని, వారిని ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ప్రభావిత ప్రాంతంలో 100 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లుగా ఎస్పీ తంగదురై వెల్లడించారు.ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# బీరుట్‌ను విడిచి వెళ్లండి

## ■ ఇజ్రాయెల్ హెచ్చరిక



ఇజ్రాయెల్‌:హెజ్ బొల్లాపై ఇజ్రాయెల్ దాడుల పరంపర కొనసాగుతుంది. ఈ తరుణంలో బీరుట్లోని దాహియాతో పాటు పొరుగుప్రాంత ప్రజలు తమ ఇళ్లను వదిలివెళ్లాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ హెచ్చరించింది. ఈమేరకు ఎక్స్లో ఓ వీడియోని పోస్ట్ చేశారు. 'మా యుద్ధం హెజ్బుల్లాతో కానీ.. లెబనాన్ ప్రజలతో కాదు. ఇజ్రాయెల్ పౌరులు లక్ష్యంగా హెజాబొల్లా దాదాపు 1,50,000 రాకెట్లు లెబనాన్లో ఉంచింది. వాటిల్లో కొన్ని వ్యూహాత్మకంగా పౌరులు నివసించే ప్రాంతాల్లో ఉంచింది. మేము ఆ ప్రాంతాలను నిర్వీర్యం చేయాలని నిర్ణయించుకున్నాం. కాబట్టి ప్రజలు వెంటనే ఆ ప్రాంతాలను విడిచివెళ్లండి'అని ఐడీఎఫ్ పేర్కొంది.ఇక, ఉత్తర ఇజ్రాయెల్ లోని పౌరులను హెజ్బుల్లా లక్ష్యంగా చేసుకున్నట్లు ఐడీఎఫ్ అధికారి పేర్కొన్నారు. లెబనాన్ నుంచి ప్రయోగించిన రాకెట్తో ఆ ప్రాంతం మొత్తం దెబ్బతిన్నట్లు వెల్లడించారు. తమ పౌరులను లక్ష్యంగా చేసుకున్న హెజ్బుల్లా నుంచి తమ దేశ ప్రజలతో పాటు, గాలి, సముద్రాన్ని రక్షించుకుంటామన్నారు.

# అమెరికాలో హెలెనా విధ్వంసం.. 44 మంది మృతి



**ఫ్లోరిడా:** ఆగ్నేయ అమెరికాలో హరికేన్ హెలెనా విధ్వంసం సృష్టిస్తోంది. ఫ్లోరిడా, జార్జియా, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, వర్జీనియా రాష్ట్రాల్లో ఈ తుపాను ప్రభావం అధికంగా ఉంది. ముఖ్యంగా ఫ్లోరిడా రాష్ట్రంపై ఈ తుపాను అత్యధికంగా ప్రభావం చూపినట్లు అధికారులు తెలిపారు. దాదాపు పది కౌంటీల్లో ఈ తుపాను తీవ్రత ఉన్నట్లు వెల్లడించారు. తుపాను ధాటికి ఆయా రాష్ట్రాలను వరద చుట్టుముట్టింది. అతి తీవ్రమైన హెలెనా కారణంగా పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.హెలెనా తుపాను కారణంగా దాదాపు 44 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది, ఒక మహిళ, నెల వయసున్న చిన్నారి సైతం ఉన్నట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. ప్రజలు అంధకారంలోకి వెళ్లిపోయారు. పలు ఆసుపత్రుల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇక యునికోయ్ కౌంటీ ఆసుపత్రిని వరదలు ముంచెత్తడంతో రంగంలోకి దిగిన అధికారులు హెలికాప్టర్ సాయంతో 54 మందిని రక్షించారు. అదేవిధంగా టెనస్సీలోని న్యూపోర్ట్ సమీపంలో 7 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ తుపాను గల్ఫ్ ఆఫ్ మెక్సికో తీరం నుంచి గురువారం మధ్యాహ్నం అమెరికాలోకి ప్రవేశించింది. ఈ తుపాను ధాటికి సముద్రపు అలలు దాఆపు 20 అడుగుల ఎత్తుకుపైనే ఎగిసిపడుతున్నాయి. ఫ్లోరిడాలో తుపాను తీరం దాటేటప్పుడు గంటలకు 225 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు అధికారులు తెలిపారు. ఈ తుపాను కారణంగా ఆయా రాష్ట్రాల్లో పాఠశాలలు, కళాశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు.

# సీసీటీవీ నిఘాలో సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు



**ఢిల్లీ:** రానున్న ఏడాదిలో నిర్వహించబోయే 10, 12 బోర్డు పరీక్షలు సీసీటీవీ నిఘాలోనే జరపాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్ణయించింది. ఈ మేరకు అనుబంధ పాఠశాలకు ఆదేశాలు జారీ చేసింది. 2025లో జరగనున్న బోర్డు పరీక్షా కేంద్రాల్లో నిఘా కెమెరాలు తప్పనిసరి చేసినట్లు అందులో పేర్కొంది. ఈవిషయాన్ని తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించింది.2025లో సీబీఎస్ఈ నిర్వహించే పరీక్షల్లో భారత్తో పాటు 26 దేశాల్లో కలిపి సుమారు 44 లక్షల మంది హాజరవుతారని బోర్డు అంచనా వేసింది. ఈమేరకు పెద్దఎత్తున వసతి కల్పించాలని సుమారు 8,000 పాఠశాలల్ని పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసింది. వాటిలో సీసీటీవీ నిఘాని తప్పనిసరి చేస్తూ ఆయా పాఠశాలలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. సీసీటీవీ సౌకర్యం లేని ఏ పాఠశాలను పరీక్షా కేంద్రంగా పరిగణించేది లేదని అందులో స్పష్టంచేసింది. రికార్డ్ ఫుటేజీ సంబంధిత అధికారులు మాత్రమే చూసేందుకు వీలుంటుందని పరీక్షా ఫలితాలు వచ్చిన రెండు నెలల వరకు ఈ ఫుటేజీ భద్రంగా ఉంటుందని పేర్కొంది. ప్రతీ పది గదులకు లేదా 240 మంది విద్యార్థుల బాధ్యత తీసుకొనేందుకు ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమిస్తున్నట్లు తెలిపింది. కొత్తగా తీసుకొచ్చిన సీసీటీవీ విధానం ద్వారా పారదర్శకత, పర్యవేక్షణ సామర్థ్యాలు పెరుగుతాయని సీబీఎస్ఈ భావిస్తోంది. వీటి సాయంతో ఎటుంటి ఆటంకం లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# ఇజ్రాయెల్ మాకు చెప్పలేదు

## దాడులు జరుగుతుంటే తెలిసింది:అమెరికా

**వాషింగ్టన్:** హెజ్ బొల్లా (గ్రూప్పై) ఇజ్రాయెల్ వరుసగా భీకర దాడులు చేస్తోంది. హెజ్ బొల్లా అధిపతి హసన్ నస్రల్లా లక్ష్యంగా లెబనాన్ రాజధాని నగరం బీరుట్ లో కురిసిన ఈ బాంబుల వర్షం పై అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్స్పందించారు. వాటిపై తమకు బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం ముందుగా సమాచారం ఇవ్వలేదని తెలిపారు. అలాగే ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రితో మాట్లాడేసరికే దాడులు జరుగుతున్నాయని వెల్లడించారన్నారు.“మాకు ముందుగా సమాచారం లేదు. నిజానికి ఆపరేషన్ జరుగుతున్నప్పుడు నేను ఇజ్రాయెల్ రక్షణమంత్రితో మాట్లాడాను. కొన్ని గంటల క్రితమే ఆపరేషన్ ప్రారంభమైందని నాకు చెప్పారు. ఈ దాడులు, తదనంతర పరిస్థితులను వారు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు మీకు చెప్పడానికి నావద్ద తగినంత సమాచారం లేదు. మరిన్ని వివరాల కోసం ఇజ్రాయెల్ రక్షణ మంత్రితో ఫోన్లో సంభాషిస్తాను” అని లాయిడ్ వెల్లడించారు.ఈ దాడిలో నస్రల్లా మరణించారా? లేదా సురక్షితంగా ఉన్నారా? అనే దానిపై స్పష్టత లేదు. అతడు సురక్షితంగా ఉన్నారని హెజ బొల్లా వర్గాలు చెబుతున్నా.. ఇజ్రాయెల్ మాత్రం ఇంకా ధ్రువీకరించుకోవాల్సి ఉందని అంటోంది. నస్రల్లా గురించిన సమాచారాన్ని సేకరిస్తున్నామని ఇరాన్తె లిపింది. దక్షిణ లెబనాన్లోని దాహియాలోని నివాసగృహాల కింద భూగర్భంలో ఉన్న హెజ్బుల్లాప్రధాన కార్యాలయంపై విధ్వంసకర బాంబులను ఇజ్రాయెల్ ప్రయోగించింది. దీంతో దాహియాతో పాటు, బీరుట్ లోని చాలా ప్రాంతాలు దద్దరిల్లాయి. చాలా భవనాలు నేలమట్టమయ్యాయి.

# కుల్గాంలో ఎదురుకాల్పులు

## ముగ్గురు ఆర్మీ జవాన్లకు గాయాలు



**కుల్గాం:** జమ్మూ కశ్మీర్‌లో మరోసారి ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కుల్గాం జిల్లాలో శనివారం ఉదయం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో నలుగురు అధికాకుల్గాం జిల్లాలోని అదిగమ్ గ్రామంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న ముందస్తు సమాచారంతో భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఉగ్రవాదుల కోసం ప్రతి ఇంట్లో సోదాలు చేపట్టారు. ఈ క్రమంలోనే భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు ఆర్మీ జవాన్లు, ఓ పోలీసు అధికారికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని అధికారులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది.రులకు గాయాలయ్యాయి.

# 'తాజ్‌వెస్ట్ ఎండ్ హెూటల్'కు బాంబు బెదిరింపు

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరు లోని ప్రముఖ తాజ్ వెస్ట్ ఎండ్ హెూటల్ కు బాంబు బెదిరింపు కాల్వచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..
బెంగళూరులోని రేస్ కోర్స్ ప్రాంతంలోని తాజ్ వెస్ట్ ఎండ్ హెూటల్లో రాజకీయ నాయకులు, క్రికెటర్లు, ప్రముఖులు బస చేస్తుంటారు. ఈ ప్రముఖ హెూటలకు శనివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఈ- మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, బాంబుస్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అప్రమత్తమైన పోలీసులు హెూటల్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువును గుర్తించలేదు. దీనిపై విచారణ జరుగుతోందని అధికారులు వెల్లడించారు.

# కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు



**బెంగళూరు:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పై కేసు నమోదైంది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను బెదిరించారన్న ఆరోపణల నేపథ్యంలో బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసు స్టేషన్‌లో నిర్మలమ్మపై కేసు నమోదైంది.ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామిక వేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి బీజేపీకి నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గతంలో తిలక్ నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అయితే, పోలీసులు అతడి ఫిర్యాదును స్వీకరించలేదు. దీంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం.. కేంద్ర మంత్రిపై కేసు నమోదు చేయాలని తిలక్‌నగర ఠాణా పోలీసులను శుక్రవారం ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 10కి వాయిదా వేసింది. కోర్టు ఆదేశాల మేరకు తిలక్‌నగర ఠాణా పోలీసులు తాజాగా కేంద్ర మంత్రిపై కేసు నమోదు చేశారు. నిర్మలా సీతారామన్‌తోపాటు మరికొందరిపై కూడా ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు.

# మణిపూర్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

**ఇంఫాల్:** మైతీ, కుకీ జాతుల మధ్య ఘర్షణలతో రగులుతున్న మణిపూర్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్ సంయుక్తంగా మూడు జిల్లాల్లో తనిఖీలు నిర్వహించారు. కాంగ్‌పోక్పి జిల్లాలోని లోచింగ్ రిడ్జ్‌లో భారీగా ఆయుధాలను శుక్రవారం కనుగొన్నారు. 303 రైఫిల్స్, మ్యాగజైన్‌తో కూడిన ఒక 9 ఎంఎం పిస్టల్, క్యాట్రిడ్జ్‌లు, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్‌లు, రెండు డిటోనేటర్లు, దేశంలో తయారు చేసిన మోర్టార్, లాంగ్ రేంజ్ ఇంప్రూవైజ్డ్ మోర్టార్‌ను స్వాధీనం చేసుకున్నారు.
కాగా, తౌబల్ జిల్లాలోని ఫైనోమ్ కొండ ప్రాంతంలో నాలుగు హ్యాండ్ గ్రెనేడ్‌లు, రెండు 'పంపి' షెల్స్, మూడు డిటోనేటర్లు, స్టన్ గ్రెనేడ్, స్టింగర్ గ్రెనేడ్, టియర్ గ్యాస్ షెల్‌ను మణిపూర్ పోలీసులు, అస్సాం రైఫిల్స్ బృందం స్వాధీనం చేసుకున్నది. అలాగే బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్‌తో కలిసి మణిపూర్ పోలీసులు చురచంద్‌పూర్ జిల్లాలోని గోథోల్ గ్రామంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. స్థానికంగా 'పంపి' అని పిలిచే రెండు అధునాతన మోర్టార్‌లను స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు శుక్రవారం భద్రతా బలగాలు జరిపిన సెర్చ్, ఏరియా డామినేషన్ విన్యాసాల సందర్భంగా ఈ మేరకు భారీగా ఆయుధాలను కొనుగొని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ సందర్భంగా ఎవరినీ అరెస్ట్ చేయలేదని పోలీస్ అధికారులు వెల్లడించారు. మణిపూర్‌లో గత ఏడాది మే నుంచి మైతీ, కుకీ జాతుల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో 200 మందికిపైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

# సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తాం

## ■ అక్రమ వలసలపై హారిస్ వ్యాఖ్యలు
## ■ ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్



**వాషింగ్టన్:** నవంబర్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండటంతో అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ పోటాపోటీగా ప్రచారాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ అరిజోనాలోని డగ్లస్‌కు చెందిన యూఎస్-మెక్సికో సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించిన ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోకి అక్రమ వలసలను నివారించేందుకు అమెరికా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేస్తానని హారిస్ పేర్కొన్నారు. అమెరికా ఇమిగ్రేషన్ వ్యవస్థను సరిచేస్తానని వెల్లడించారు. ఎన్నోఏళ్లుగా యూఎస్లో నివాసముంటున్న ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వలసదారులకు పౌరసత్వం కల్పించడానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించారు.“డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న నాలుగేళ్లలో మన విచ్ఛిన్నమైన ఇమిగ్రేషన్ వ్యవస్థను సరిదిద్దడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇమిగ్రేషన్ ఏజెంట్ల కొరత సమస్యను పరిష్కరించలేదు. విదేశీయులు దేశంలోకి ప్రవేశించడానికి ఎటువంటి చట్టబద్ధమైన మార్గాలను రూపొందించలేదు. ఈ విధంగా రాజకీయాలు చేయడానికి ప్రజలను ఉపయోగించుకునే వారికంటే దేశ భద్రత గురించి శ్రద్ధ వహించేవారికి ఎన్నికల్లో ప్రజలు తమ మద్దతు ఇవ్వాలి” అని హారిస్ పేర్కొన్నారు. మాజీ సరిహద్దు రాష్ట్ర అటార్నీ జనరల్ గా విధులు నిర్వహించిన తనకు సరిహద్దు వద్ద భద్రత, చట్టాలను అమలుచేయడం వంటివాటిపై అవగాహన ఉందని తెలిపారు. గతంలో తాను తుపాకులు, మాదకద్రవ్యాలు, మానవుల అక్రమ రవాణా వంటి విషయాల్లో అంతర్జాతీయ క్రిమినల్ సంస్థలను విచారించినట్లు పేర్కొన్నారు.కాగా హారిస్ వ్యాఖ్యలపై రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా సరిహద్దు వద్దకువెళ్లని హారిస్కు ఎన్నికల వేళ అక్రమ వలసల సమస్య గుర్తొచ్చిందా అని ప్రశ్నించారు. సరిహద్దులకు వెళ్లి ప్రసంగించడానికి ఇది సరైన సమయం కాదని దుయ్యబట్టారు. ఆ సమస్య గురించి ఆలోచించేవారే అయితే నాలుగేళ్లుగా సరిహద్దు వద్దకు వెళ్లకుండా ఏం చేశారని అడిగారు. హింసాత్మక మూకలు అమెరికాలో ప్రవేశించి ఇక్కడ హత్యలు, అత్యాచారాలు చేస్తున్నా ఆమె పట్టించుకోలేదని మండిపడ్డారు. చిన్న పట్టణాలన్నింటినీ హారిస్శరణార్థుల శిబిరాలుగా మార్చేశారని ఆరోపించారు.



# రెండో రోజు ఆట రద్దు

**కాన్పూర్:** భారత్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు రెండో రోజు ఆట తుడిచిపెట్టుకుపోయింది. వర్షం కారణంగా స్టేడియం చిత్తడిగా మారడంతో కనీసం ఒక్క బంతి కూడా పడకముందే.. ఇవాళ్టి ఆటను ముగించినట్లు అంపైర్లు ప్రకటించారు. వాస్తవానికి వర్షం కారణంగా మైదానం చిత్తడిగా మారిందని.. దీంతో కాస్త మ్యాచ్ ప్రారంభం కావడం ఆలస్యమవుతోందని బీసీసీఐ ప్రకటించింది. అయితే మధ్యాహ్నం వరకూ ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో ఇవాళ్టి ఆట రద్దు అయినట్లు అంపైర్లు వెల్లడించారు. స్వదేశంలో ఆడిన టెస్టులో భారత్ ఇలా వర్షం కారణంగా ఓ రోజు ఆటను కోల్పోవడం గత తొమ్మిదేళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2015లో దక్షిణాఫ్రికాతో బెంగళూరులో జరిగిన మ్యాచ్‌లోనూ వర్షం కారణంగా ఒక రోజు ఆట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఫలితంగా ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే.. ఆ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అప్పటి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ.. బౌలింగ్ ఎంచుకున్నాడు. అప్పటి నుంచి కాన్పూర్ టెస్టు వరకూ స్వదేశంలో జరిగిన మరే టెస్టులోనూ భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోలేదు. కానీ కాన్పూర్ టెస్టులో మాత్రం కెప్టెన్ రోహిత్ శర్మ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో తొమ్మిదేళ్ల తర్వాత ఈ తరహా నిర్ణయం తీసుకున్న కెప్టెన్‌గా నిలిచాడు. ఇక రెండో టెస్టులో రెండో రోజు ఆటను కోల్పోవడం భారత్‌కు ఇబ్బంది కరంగా మారింది. ఈ టెస్టులో మరో మూడు రోజుల ఆట మాత్రమే మిగిలి ఉంది. అంతా సవ్యంగా సాగితే తొమ్మిది సెషన్‌ల ఆట జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ కచ్చితంగా బంగ్లాదేశ్‌ను రెండు సార్లు ఆలౌట్ చేయాల్సి ఉంది. ఇదే సమయంలో వేగంగా బ్యాటింగ్ చేసి పరుగులు చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా ఈ మ్యాచ్ డ్రా అయితే మాత్రం.. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ బెర్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ సిరీస్ తర్వాత భారత్.. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ఆడనుంది. ఆ రెండు జట్లతో కలిపి 8 మ్యాచ్‌లు ఆడాలి. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ డ్రా అయితే.. ఈ 8 మ్యాచ్‌ల్లో కనీసం నాలుగింట్లో గెలిస్తేనే భారత్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఫామ్ దృష్ట్యా రోహిత్ సేనకు ఇదేమంత కష్టం కాకపోయినా.. బంగ్లాదేశ్‌తో మ్యాచ్ గెలిస్తే.. సమీకరణాలు భారత్‌కు అనుకూలంగా మారతాయి. మరి ఈ టెస్టు ఎలా ముగుస్తుందో తెలియాలంటే మరో మూడు రోజులు ఆగాల్సిందే. ఈ టెస్టులో తొలి రోజు వర్షం కారణంగా కేవలం 35 ఓవర్ల ఆటే సాగింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 107/3తో తొలి రోజు ఆటను ముగించింది.

# ఎస్ఆర్‌హెచ్ రిటెన్షన్ లిస్ట్ ఇదే!



**విశ్వంభర, క్రీడావిభాగం:** ఐపీఎల్ మెగా వేలం నిబంధనలు దాదాపు ఖరారయ్యాయి. ఓ ఆర్‌టీఎమ్ కార్డ్‌ను ఉపయోగిస్తూ గరిష్టంగా ఆరుగురు ఆటగాళ్లను ఓ ఫ్రాంచైజీ అట్టిపెట్టుకునే అవకాశం ఉంది. అంటే అయిదుగురు ప్లేయర్లను నేరుగా రిటైన్ చేసుకుంటూ వేలంలో అదనంగా ఓ ఆటగాడిని ఆర్‌టీఎమ్ కార్డ్ ద్వారా దక్కించుకోవచ్చు. దీనిపై మరికొన్ని గంటల్లో బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన విడుదల కానుంది. ఈ క్రమంలో ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ లిస్ట్‌ను సిద్ధం చేయడానికి చర్యలు వేగవంతం చేస్తున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ రిటెన్షన్ లిస్ట్‌ను దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. బీసీసీఐ వెల్లడించనున్న ఈ 5+1 ఆర్‌టీఎమ్ కార్డ్ నిబంధనలు ఎస్ఆర్‌హెచ్‌కు గొప్పగా కలిసొస్తున్నాయి. ఆర్‌టీఎమ్ కార్డ్ లేకుండా కేవలం అయిదుగురు ఆటగాళ్లనే రిటైన్ చేసుకోవాలనే రూల్ ఖరారైతే.. ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యానికి తలనొప్పిగా మారేది. ఎందుకంటే అయిదుగురు ఆటగాళ్లలో ఇద్దరు విదేశీ ప్లేయర్లకు మాత్రమే ఛాన్స్ ఉండే అవకాశం ఉంది. సన్‌రైజర్స్ జట్టులో కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు ఓపెనర్ ట్రావిస్ హెడ్, వికెట్ కీపర్ హెన్రిచ్ క్లాసెన్ ఎంతో కీలకం. ఈ ముగ్గురిలో ఒకరిని విడిచిపెట్టాలంటే మ్యాచ్ విన్నర్‌ను కోల్పోయినట్లే. కానీ ఆర్‌టీఎమ్ కార్డ్ ఉపయోగిస్తూ ముగ్గురుని సొంతం చేసుకోవచ్చు. అయితే దీనిలో ఎస్ఆర్‌హెచ్ సీఈవో కావ్య మారన్ ఆర్థిక వ్యూహాలు అమలు చేయనుంది. కమిన్స్, క్లాసెన్‌ను రిటైన్ చేసుకుని హెడ్‌ను ఆర్‌టీఎమ్ ద్వారా దక్కించుకోవాలని చూస్తోంది. కమిన్స్ బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు కెప్టెన్సీలోనూ సత్తాచాటగలడు. ఇక క్లాసెన్ వికెట్ కీపింగ్‌తో ఫినిషర్‌గా రాణించగలడు. వీరిద్దరికి వేలంలో భారీ డిమాండ్ ఉంటుంది. హెడ్‌కు కూడా డిమాండ్ ఉన్నప్పటికీ విభిన్న పాత్రలు పోషించే వారి కంటే కాస్త తక్కువగా ఉంటుంది. దీంతో పర్స్‌వ్యాల్యూను కాపాడుకోవచ్చని కావ్య మేడమ్ ఆలోచిస్తోంది. ఇక కుర్రాళ్లను రిటైన్ చేసుకోవాలని కావ్య భావిస్తోంది. అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, నటరాజన్‌ను రిటైన్ లిస్ట్‌లో యాడ్ చేసింది. ఒకవేళ విదేశీ ప్లేయర్లకు లిమిట్ విధించకపోతే.. నితీశ్ లేదా నటరాజన్ ఆర్‌టీఎమ్ ద్వారా దక్కించుకోవాలని కావ్య ఆలోచిస్తోంది.

# టీ20 క్రికెట్‌లో నికోలస్ పూరన్ రికార్డు

**విశ్వంభర, క్రీడావిభాగం:**

వెస్టిండీస్ క్రికెటర్ నికోలస్ పూరన్ గురించి అందరికీ తెలుసు. అతను మంచి ఆటగాడు. ఈ స్టార్ ఆటగాడు అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం ఇతను కరేబియన్ ప్రీమియర్ లీగ్ 2024లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ తరపున ఆడుతున్నాడు. ఈ క్రమంలోనే నికోలస్ పూరన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. నికోలస్ పూరన్ టీ20ల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా వరల్డ్ రికార్డు సృష్టించాడు. శనివారం సీపీఎల్‌లో భాగంగా బార్బడోస్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నికోలస్ పూరన్ 28 పరుగులు చేశాడు. దాని తర్వాత పూరన్ ఈ ఫీట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఏడాది టీ20ల్లో నికోలస్ ఇప్పటి దాకా 65 ఇన్నింగ్స్ ఆడాడు. ఇందులో 42.02 సగటుతో 2,059 పరుగులు చేశాడు. 14 హాఫ్ సెంచరీలు ఉండడం విశేషం. ఇంతకుముందు ఈ రికార్డు పాకిస్తాన్ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ పేరిట ఉండేది. దాన్ని బ్రేక్ చేశాడు ఈ వెస్టిండీస్ ప్లేయర్ నికోలస్ పూరన్. అంతకుముందు 2021 ఏడాదిలో 45 టీ20 ఇన్నింగ్స్‌లు ఆడిన నికోలస్ పూరన్ 2,036 పరుగులు చేశాడు. తాజా మ్యాచ్‌తో రిజ్వాన్ ఆల్‌టైమ్ రికార్డును ఈ కరేబియన్ విధ్వంసకర వీరుడు బ్రేక్ చేశాడు. ఈ ఏడాదిలో టీ20ల్లో వెస్టిండీస్, దర్బన్ సూపర్ జెయింట్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఎంఐ ఎమిరేట్స్, ఎంఐ న్యూయార్క్, నార్తర్న్ సూపర్ ఛార్జర్స్, రంగ్‌పూర్ రైడర్స్, ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ జట్లకు పూరన్ ప్రాతినిథ్యం వహించాడు.



# బంగ్లాతో T20 సిరీస్‌కు భారత్ టీమ్

**విశ్వంభర, క్రీడావిభాగం:** బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు బీసీసీఐ టీమ్‌ఇండియా జట్టును ప్రకటించింది. 15 మందితో కూడిన జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఈ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డికి టీమ్‌ఇండియా పిలుపు అందింది. ఇక స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి దాదాపు మూడేళ్ల తర్వాత జాతీయ జట్టుక ఎంపికయ్యాడు. కాగా, భారత్ - బంగ్లాదేశ్ మధ్య టీ20 సిరీస్ అక్టోబర్ 06న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో మూడు టీ20 మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. అందులో గ్వాలియర్, న్యూ దిల్లీ, హైదరాబాద్ వేదికలుగా ఈ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7 గంటలకు ప్రారంభం అవుతాయి. భారత్ జట్టు : సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేష్ శర్మ (వికెట్ కీపర్), అర్షదీప్ సింగ్, హర్షిత్ రానా, మయాంక్ యాదవ్.





# మన ఈక్విటీలపై 'విదేశీ' మోజు

## ఈ నెలలోనే ₹57,359 కోట్లు పెట్టుబడులు

**ముంబయి:** దేశీయ ఈక్విటీల్లో మళ్లీ విదేశీ మదుపర్ల కొనుగోళ్ల ఉత్సాహం కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో కాస్త ఆచితూచి వ్యవహరించిన విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు .. ఇప్పుడు మళ్లీ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నారు. ఒక్క సెప్టెంబర్ నెలలో ఇప్పటి వరకు నికరంగా రూ.57,359 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఈ మొత్తం లక్ష కోట్ల రూపాయలు దాటడం గమనార్హం. తొమ్మిది నెలల్లో ఈ స్థాయిలో పెట్టుబడులురావడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జనవరిలో రూ.25,744 కోట్ల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ మదుపర్లు.. ఫిబ్రవరిలో రూ.1539 కోట్లు, మార్చిలో రూ.35,098 కోట్లు నికరంగా పెట్టుబడి పెట్టారు. మళ్లీ ఏప్రిల్ నెలలో రూ.8,671, కోట్లు, మే నెలలో రూ.25,586 కోట్లు చొప్పున నిధులను వెనక్కి తీసుకున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం జూన్ నెలలో రూ.25,565 కోట్లు, జులైలో రూ.32,359 కోట్లు నిధులను వెచ్చించారు. ఆగస్టులో రూ.7,322 కోట్ల విలువైన షేర్లను విదేశీ మదుపర్లు కొనుగోలు చేయగా.. సెప్టెంబర్లో భారీ మొత్తంలో నిధులు కుమ్మరించారు. దేశీయ ఈక్విటీల్లో కొన్ని రోజులుగా విదేశీ మదుపర్ల కొనుగోళ్ల వెనుక అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత ముఖ్య భూమిక పోషించిందని నిపుణులు చెబుతున్నారు. రేట్ల కోత వల్ల ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి మార్కెట్లలోకి నిధులు ప్రవాహం కొనసాగుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దేశీయ కరెన్సీ రూపాయి బలపడడమూ మరో కారణమని పేర్కొంటున్నారు. శుక్రవారం మాత్రం రూ.1209 కోట్ల నిధులు వెనక్కితీసుకోవడంతో ప్రధాన విక్రేతలుగా మిగిలారు. వృద్ధికి ఊతం ఇచ్చేలా చైనా ఇటీవల తీసుకున్న పలు నిర్ణయాల వల్ల ఎఫ్‌పీఐలు తరలిపోయే అవకాశాలూ ఉన్నాయన్న అనుమానాలు నెలకొన్నాయి.

## చమురు కంపెనీల ఆదాయం పెరిగినా

# సామాన్యులకు ఊరట కలిగించేరేమీ?!




**విశ్వంభర (బిజినెస్):** దేశానికి చెందిన చమురు కంపెనీల లాభం భారీగా పెరిగింది. మార్చి నుంచి పెట్రోల్‌పై లీటర్‌కు రూ.15, డీజిల్‌పై రూ.12 లాభం వస్తున్నది. ఈ సమయంలో ముడి చమురు బ్యారెల్‌కు 84 డాలర్ల నుంచి 72 డాలర్ల దిగువకు చేరింది. వాస్తవానికి కంపెనీలు ధరలను తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు చాలా అవకాశం ఉన్నది. ముడి చమురు ధర బ్యారెల్‌కు 71.31 డాలర్లకు చేరింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పడుతుండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.60వేలకోట్ల దిగుమతి బిల్లు ఆదా కానున్నది. అయినా ధరలను తగ్గించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కావాలంటే లాభాలు ఇవ్వొచ్చని.. చాలాకాలంగా ధరలు స్థిరంగా ఉంటున్నాయని ఐసీఆర్ఏ నివేదిక పేర్కొంటున్నది. ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ నివేదిక ప్రకారం.. మార్చి నుంచి క్రూడ్ ధర 12శాతం పతనమైంది.సౌదీ అరేబియా ధరలను తగ్గించేందుకు సిద్ధమవుతోందని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో రాబోయే కాలంలో ధరలు మరింత తగ్గే అవకాశం ఉంది. దేశీయ ఆయిల్ కంపెనీల లాభాలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. క్రూడాయిల్ బ్యారెల్‌కు డాలర్ తగ్గితే భారత్‌కు దిగుమతి బిల్లులపై వార్షికంగా రూ.13వేలకోట్లు ఆదా అవుతుంది. ఆర్థిక సర్వే 2024 ఈ ఆర్థిక సంవత్సరంలో ముడి చమురు సగటు ధర బ్యారెల్‌కు 84 డాలర్లుగా ఉండవచ్చని అంచనా వేసింది. అయితే, ప్రస్తుతం బ్యారెల్‌కు 70 నుంచి 75 డాలర్ల మధ్య పలుకుతున్నది. ఇదే సమయంలో ధరలను స్థిరీకరించినట్లయితే ఈ ఆర్థిక సంవత్సరంలో భారత్ మరింత బిల్లును మరింత ఆదా చేయగలదని నిపుణులు పేర్కొంటున్నారు. ఫలితంగా ద్రవ్యోల్బణం తగ్గుతుందని.. పెట్టుబడులకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. దేశానికి చెందిన ప్రధాన మూడు చమురు కంపెనీలు భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ సంస్థలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.81వేలకోట్ల లాభాన్ని ఆర్జించాయి. ఇందులో ఇండియన్ ఆయిల్ రూ.39,619 కోట్లు, భారత్ పెట్రోలియం రూ.26,673 కోట్లు, హిందుస్థాన్ పెట్రోలియం రూ.14,694 కోట్లు వెనుకేసుకున్నాయి.

- తగ్గిన ముడి చమురు ధరలు
- 84 డాలర్ల నుంచి 72 డాలర్ల దిగువకు చేరిక
- వేలకోట్ల ఆదాయాన్ని వెనుకేసుకున్న ఆయిల్ కంపెనీలు

# తమిళనాడులో టాటా మోటార్స్ కొత్త ప్లాంట్..

## శంకుస్థాపన చేసిన స్టాలిన్

**రాణిపేట్ (తమిళనాడు):** ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తమిళనాడులో కొత్త కర్మాగారం ఏర్పాటు చేస్తోంది. స్పోర్ట్స్ కార్లు. ఎసయూవీల తయారీకి ఉద్దేశించిన ఈ ప్లాంట్కు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.9వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్లాంట్ లో టాటా మోటార్స్, జాగ్వార్ ల్యాండ్ రోవర్కు చెందిన తదుపరి తరం వాహనాలు తయారుచేయనున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. దశలవారీగా ఈ కర్మాగారం అందుబాటులోకి రానుందని టాటా మోటార్స్ తెలిపింది. ఏడాదికి 2.50 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యంలతో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. చెన్నైకి 115 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాణపాక్కంలో ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్తో పాటు, డీఎంకే మంత్రులు దురై మురుగన్, టీఆర్బీ రాజా, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, టాటా మోటార్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇక్కడ తయారైన కార్లను దేశీయంగా విక్రయించడంతో పాటు విదేశాలకూ ఎగుమతి చేస్తామని టాటా మోటార్స్ తెలిసింది. రాష్ట్రంలో కార్ల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం పట్ల సీఎం స్టాలిన్ హర్షం వ్యక్తంచేశారు. తమిళనాడుతో టాటా గ్రూప్ చాలా ఏళ్ల అనుబంధం అని, తమ గ్రూప్ కంపెనీలు ఎన్నో ఇక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయని చంద్రశేఖరన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్లాంట్ వల్ల సుమారు 5వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



# తిరుపతి లడ్డూ వివాదంపై సూపర్‌స్టార్ ఏమన్నడంటే..

ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ ఆరోపణలపై హిందువాదులు, భక్తులు ఆందోళన చెందుతున్నారు. కల్తీ ఆరోపణలపై విచారణ జరిపించి నిజ నిజాలు తేల్చి కల్తీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదంపై కొంత మంది సినీతారలు, పొలిటికల్ లీడర్స్ కూడా స్పందిస్తున్నారు. ఇదే విషయంపై సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను అడిగితే, సమాధానం చెప్పడానికి ఆయన ఆసక్తి చూపలేదు. రజనీ తన తాజా చిత్రం వేట్టయాన్ ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు.



ఇందులో భాగంగానే ఓ ఈవెంట్ లో ఆయన్ని పలువురు విలేకర్లు వేట్టయాన్ సినిమా గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే అందులో ఓ విలేకరి 'తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందంటూ ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మీ స్పందన ఏమిటి? అని ప్రశ్నించగా... సారీ నో కామెంట్స్ అని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రజనీకాంత్ హీరోగా నటించి వేట్టయాన్ అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఇటీవల సత్యం సుందరం ప్రీరిలీజ్ వేడుకలో పాల్గొన్న తమిళ నటుడు కార్తీ 'ఇప్పుడు లడ్డూ గురించి మాట్లాడకూడదు.. సున్నితమైన అంశం' అని యాంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో బాగా ప్రచారం కావడంతో ఏపీ డిప్యూటీ సీఎం నటుడు పవన్ కల్యాణ్ ఆయన వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. "సనాతన ధర్మం విషయంలో సరదాగా మాట్లాడకూడదు. సినిమా నటులు ఈ అంశంపై హుందాగా మాట్లాడండి.. లేకపోతే మౌనంగా కూర్చోండి. మీ మాధ్యమాల ద్వారా కామెడీగా మాట్లాడితే ప్రజలు క్షమించరు. లడ్డూ వివాదంపై జోకులేయకండి" అని అంటూ పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో, వెంటనే స్పందించిన కార్తీ... ఈ విషయంలో తనను క్షమించాలని కోరిన సంగతి తెలిసిందే.

# 'రా మచ్చా మచ్చా..' సాంగ్ ప్రోమో అదిరిపోయింది

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. 2024 క్రిస్మస్ సందర్భంగా తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ సినిమా అప్డేట్స్ కోసం ఫ్యాన్స్, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా మూవీ నుంచి సెకండ్ సాంగ్ 'రా మచ్చా మచ్చా..' సాంగ్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. తెలుగు, తమిళంలో పాటు 'రా మచ్చా మచ్చా..' అంటూ సాగే ఈ పాట హిందీలో 'ధమ్ తు దికాజా..' అంటూ అలరించనుంది. పూర్తి పాటను సెప్టెంబర్ 30వ తేదీన విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ తెలిపారు.



'రా మచ్చా మచ్చా..' సాంగ్ ప్రోమో విషయానికి వస్తే.. రామ్ చరణ్ ఇంట్రడక్షన్ సాంగ్‌గా రూపుదిద్దుకున్న ఈ సాంగ్‌ను ఇండియన్ సినీ హిస్టరీలో నెవ్వర్ బిఫోర్ అనేలా స్టార్ డైరెక్టర్ శంకర్ తన మార్క్‌ను చూపిస్తూ తెరకెక్కించారనేది ఈ ప్రోమో చూస్తుంటే అర్థమవుతుంది. ఎనర్జిటిక్, స్టైలిష్ లుక్‌లో రామ్ చరణ్ ఆకట్టుకుంటున్నారు. ఇక గ్రేస్‌తో ఆయన వేసిన హుక్ స్టెప్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. ఈ స్టెప్ నెట్టింట ఓ రేంజ్‌లో వైరల్ అవుతుందనటంలో సందేహం లేదు. ఇందులో ఏకంగా 1000కి పైగా జానపద కళాకారులు ఈ పాటలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి డాన్స్ చేయటం విశేషం. అది కూడా భిన్నత్వానికి ఏకత్వమైన మన దేశంలోని ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులు.. ఇందులో భాగమవటం విశేషం. రామ్ చరణ్ ఈ పాటలో చాలా స్టైలిష్‌గా కనిపిస్తుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృతులను బేస్ చేసుకుని ఈ పాటను శంకర్ వినూత్నంగా తెరకెక్కించారు. ఏపీలో గుసాడి, కొమ్ము కోయ, తప్పెట గుళ్లు వంటి జానపద నృత్యాలతో పాటు వెస్ట్ బెంగాల్‌కు చెందిన చౌ, ఒరిస్సాకు చెందిను గుమ్రా, రానప్ప, పైకా, దురువ వంటి వాటితో పాటు, కర్ణాటకు చెందిన హలారి, ఒక్కలిగ, గౌరవర, కుణిత వంటి నృత్య రీతులను కూడా భాగం చేశారు. గ్రాండియర్ లుక్, డిఫరెంట్ సౌండింగ్‌తో పాట ఎనర్జిటిక్‌గా ఉంది. గణేష్ ఆచార్య మాస్టర్ కొరియోగ్రఫీలో మ్యూజిక్ సెన్సేషన్ తమన్ సంగీత సారథ్యంలో ఈ పాట రూపుదిద్దుకుంది. తెలుగు, తమిళం, హిందీలో నకాష్ అజీజ్ పాడిన ఈ పాటను తెలుగులో అనంత్ శ్రీరామ్ రాయగా, తమిళంలో వివేక్, హిందీలో కుమార్ రాశారు.

# సమంతకు అరుదైన గౌరవం



వైవిధ్య భరిత పాత్రలను ఎంచుకుంటూ తన నటన, అందంతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత. 'ఏమాయ చేశావే' సినిమాతో ప్రేక్షకులను మాయ చేసిన సమంత ఇప్పటికీ స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం సౌత్ ఇండియాలోని టాప్ హీరోయిన్లలో సమంత ఒకరు. అంతేకాకుండా అత్యధిక పారితోషికం అందుకుంటున్న సౌత్ కథానాయికలలో కూడా సమంత ముందు వరుసలో ఉంది. అయితే, ప్రస్తుతం అనారోగ్యం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా సామ్‌కు అరుదైన గౌరవం దక్కింది. వుమెన్ ఆఫ్‌ది ఇయర్ అవార్డును గెలుసుకుంది. సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఫా అవార్డుల వేడుక అబుదాబి వేదికగా ఘనంగా జరుగుతోంది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్, కోలీవుడ్ నుంచి నటులు హాజరై సందడి చేశారు. ఈవెంట్‌లో భాగంగా రెండో రోజు స్టార్ నటులు సమంత, రానా, వెంకటేశ్, బాలకృష్ణ, చిరంజీవి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఈ వేడుకల్లోనే సామ్‌ను నిర్వాహకులు ప్రతిష్ఠాత్మక 'వుమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'తో సత్కరించారు. ఇక ఈ వేడుకల్లో మెగాస్టార్ చిరంజీవి మరో ప్రతిష్ఠాత్మక అవార్డును కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఐఫా 2024కు గాను 'ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' అవార్డును మెగాస్టార్ అందుకున్నారు. బాలీవుడ్ దిగ్గజం లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ చేతుల మీదుగా మెగాస్టార్ ఈ అవార్డును అందుకున్నారు. మరోవైపు ఉత్తమ చిత్రం విభాగంలో రజనీకాంత్ నటించిన 'జైలర్' సినిమాకు అవార్డు దక్కగా.. ఉత్తమ నటుడు తెలుగు విభాగంలో 'దసరా' సినిమాకు నాని అవార్డు అందుకున్నారు.



# కొత్త టీమ్‌తో అజిత్ కుమార్ హల్‌చల్!



కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ తాజాగా తన రేసింగ్ టీమ్‌ను ప్రకటించారు. 'అజిత్ కుమార్ రేసింగ్' అనే పేరుతో టీమ్‌ను ఓ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు అజిత్ మేనేజర్ సురేశ్ చంద్ర తాజాగా వెల్లడించారు. ఈ సంద ర్భంగా దుబాయ్ ఆటోడ్రోమ్‌లో ఫెరారీ 488 ఈవీఓను అజిత్ టెస్ట్ డ్రైవ్ చేసిన ఫొటోలను తమ సోషల్ మీడియా అకౌంట్ లో పంచుకున్నారు. ఈ రేసింగ్ టీమ్ వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటుందంటూ ఆ సంస్థ అధికారులు తెలిపారు. ఈ టీమ్‌కు ఫాబియన్ డిఫియక్స్ అఫిషియల్ డ్రైవర్‌గా వ్యవహరించనున్నారు. దీని ద్వారా ట్యాలెంటడ్ యువతను ప్రోత్సహించడమే తమ ఉద్దేశమని వారు తెలిపారు. అదే సమయంలో రేసింగ్ ప్రోగ్రామ్‌కు కూడా మద్దతు తెలుపుతున్నామన్నారు. త్వరలోనే ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు పంచుకోనున్నట్లు పేర్కొన్నారు.

**13 ఏళ్ల తర్వాత మోటార్ రేసింగ్‌లోకి..**

2025లో జరగనున్న యూరోపియన్ జీటీ4 ఛాంపియన్‌షిప్‌లో అజిత్ టీమ్ పాల్గొంటుందంటూ ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఎస్‌సీఐ) తాజాగా ప్రకటించింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత అజిత్ మళ్లీ ఈ మోటార్ రేసింగ్‌లోకి రావడం తమకు సంతోషంగా ఉందంటూ ఎఫ్ఎంఎస్‌సీఐ అధ్యక్షుడు అక్బర్ ఇబ్రహీం పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఔత్సాహికులైన మహిళల కోసం వీనస్ మోటార్ సైకిల్స్ శిక్షణ కార్యక్రమాలను కూడా ప్రారంభించింది. మోటార్ సైకిల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అజిత్ ఈ స్టార్టప్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇక అజిత్ అప్‌కమింగ్ మూవీస్ విషయానికి వస్తే, ఆయన ప్రస్తుతం తన 62వ చిత్రమైన 'విడా ముయార్చి' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. మగిల్ తిరుమేని డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో అజిత్ సరసన త్రిష నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కాకుండా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే ద్విభాష చిత్రంలోనూ నటిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ డైరెక్షన్ లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా మేకర్స్ విడుదల చేయనున్నారు.

## జాన్వీ కపూర్ నటనపై ఆమె బాయ్‌ఫ్రెండ్ ఆసక్తికర కామెంట్స్

గ్లోబల్ స్టార్ ఎన్‌టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన దేవర మూవీ శుక్రవారం వరల్డ్‌వైడ్‌గా విడుదలైన విషయం తెలిసిందే. మొదటి ఆట నుంచే తారక్ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. దీంతో తొలిరోజు భారీ కలెక్షన్లు కొల్లగొట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకు మొదటిరోజు ఏకంగా రూ.172 కోట్లు రాబట్టినట్లు తాజాగా మేకర్స్ ఓ స్పెషల్ పోస్టర్ ద్వారా ప్రకటించారు. ఇక ఈ చిత్రంలోని జాన్వీ కపూర్ నటనపై ఆమె బాయ్‌ఫ్రెండ్ శిఖర్ పహరియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ఈ మూవీని చూసిన అతడు జాన్వీ నటనకు ఫిదా అయినట్లు తెలిపాడు. తెరపై ఆమె అప్పియరెన్స్ కు మతిపోయినట్లు పేర్కొన్నాడు. సింప్లీ సూపర్బ్ యాక్టింగ్ అంటూ ప్రశంసలు కురిపించాడు. "నేనేమైనా కలగంటున్నానా?" అంటూ మూవీలోని జాన్వీ ఫొటోను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నాడు. దీంతో ప్రస్తుతం అతని పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, శిఖర్ పహరియా... మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే మనవడు అనే విషయం తెలిసిందే. గత కొంతకాలంగా జాన్వీ కపూర్ అతనితో డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ జంట తరచూ బాలీవుడ్లో జరిగే పార్టీలకు హాజరవుతుంటారు. అలాగే తిరుమలకు కూడా కలిసి వెళుతుంటారు.

# గుండె సేఫ్‌గా ఉండాలంటే ఇలా చేయండి



**విశ్వంభర, ఫిచర్ :** సెప్టెంబరు 29వ తేదీని ప్రపంచ హృదయ దినోత్సవం జరుపుకుంటారు, ఇది గుండె ఆరోగ్య అవగాహనను ప్రోత్సహించడానికి World Heart Day ను జరుపుకుంటారు. నేటి బిజీ లైఫ్ స్టైల్లో గుండెజబ్బుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెద్దవారిలోనే కాకుండా 30 నుండి 40 ఏళ్ళ వయస్సున్న వారిలో కూడా గుండె జబ్బులు సర్వసాధారణంగా మారుతున్నాయి. అందుకు కారణాలు కూడా లేకపోలేదు. గుండెజబ్బులకు ప్రధాన కారణాలుగా ఒత్తిడి, డయాబెటిస్, స్మోకింగ్, హై కొలెస్ట్రాల్, డ్రింకింగ్ వంటివి కారకాలుగా ఉన్నట్లు కనుగొన్నారు. అదనంగా డ్రగ్స్ వాడకం, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, దీర్ఘకాలిక వ్యాధులు యువతలో ఎక్కువగా ఉన్నట్లు నిపుణులు కనుగొన్నారు. కార్డియోవాస్కులర్ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా మరణానికి ప్రధాన కారణం, అయితే శుభవార్త ఏమిటంటే సాధారణ జీవనశైలి మార్పులు ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించగలవు. మీ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రింది 10 జీవనశైలి మార్పులను నిపుణులు సిఫార్సు చేస్తున్నారు.

**వ్యాయామం**

వారానికి 150 నిమిషాల మితమైనతీవ్రత ఏరోబిక్ వ్యాయామం లేదా 75 నిమిషాల తీవ్రమైనతీవ్రత ఏరోబిక్ వ్యాయామం కోసం లక్ష్యంగా పెట్టుకోండి. శక్తి శిక్షణ, అధికతీవ్రత విరామ శిక్షణ (HIIT) మరియు వ్యాయామాలను చేర్చండి.

**ఆరోగ్యకరమైన బరువును నిర్వహించండి**

18.5 మరియు 24.9 మధ్య BMIని సాధించండి మరియు నిర్వహించండి. నడుము చుట్టుకొలతను పర్యవేక్షించండి

**సమతుల్య ఆహారం తీసుకోండి పూర్తి, ప్రాసెస్ చేయని ఆహారాలపై దృష్టి పెట్టండి:** పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు. చక్కెర పానీయాలు, సంతృప్త కొవ్వులు మరియు సోడియంను పరిమితం చేయండి.

**ఒత్తిడిని తగ్గించుకోండి**

ఒత్తిడిని తగ్గించే కార్యకలాపాలలో పాల్గొనండి. ధ్యానం, యోగా, లోతైన శ్వాస లేదా నడక. నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి (7 నుండి 8 గంటలు) మరియు సడలింపు పద్ధతులను పాటించండి.

**రక్తపోటును పర్యవేక్షించండి**

రెగ్యులర్ రక్తపోటు తనిఖీలు పొందండి. 6. కొలెస్ట్రాల్‌ను నియంత్రించండి సాధారణ లిపిడ్ ప్రొఫైల్‌లను పొందండి. LDL (చెడు) కొలెస్ట్రాల్ 60 mg/dL కోసం లక్ష్యంగా పెట్టుకోవాలి.

ధూమపానం మరియు మద్యపానాన్ని పరిమితం చేయండి ధూమపానం మానేయండి లేదా సెకండ్‌హ్యాండ్ పొగను నివారించండి.

**హైడ్రేటెడ్ గా ఉండండి**

రోజుకు 8 కప్పుల నీరు త్రాగాలి. చక్కెర పానీయాలు మరియు కెఫిన్ మానుకోండి.

తగినంత నిద్ర పొందండి రాత్రికి 7-8 గంటల నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి. స్థిరమైన నిద్ర షెడ్యూల్‌ను ఏర్పాటు చేసుకోండి.

రెగ్యులర్ చెక్‌అప్‌లను చేయించుకోండి

ఏటా మీ కార్డియాలజిస్ట్ లేదా ప్రైమరీ కేర్ వైద్యుడిని సందర్శించండి. ప్రమాద కారకాలు, కుటుంబ చరిత్ర మరియు స్క్రీనింగ్‌లను చర్చించండి. అదనపు చిట్కాలు: మీ కుటుంబ వైద్య చరిత్రను తెలుసుకోండి. మధుమేహం మరియు రక్తపోటు కోసం రెగ్యులర్ స్క్రీనింగ్‌లను పొందండి. ఈ సాధారణ జీవనశైలి మార్పులను చేర్చడం ద్వారా, మీరు గుండె జబ్బుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. గుర్తుంచుకోండి, నివారణ కీలకం.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com